TELTEL/2016/69862

జనం పవర్

తెలుగు దినపత్రిక JANAM POWER

సంపుటి: 10 | సంచిక:63 | వెల:05 | 30-07-2025, బుధవారం

EDITOR: BANDARI MARUTHI

బీసీ రిజర్వేషన్లపై మీ వైఖరి ఏమిటి?

కేసీఆర్.. మౌనం వీడరా?

కాంగ్రెస్ పోరాటానికి మద్దతు ఇస్తారా లేదా?

- బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ పోరాటం
- మరి బీఆర్ఎస్ స్టాండ్ ఏమిటి?
- కవితను ముందుకుతోసి రాజకీయాలు చేస్తున్నారా?
- బీసీ రిజర్వేషన్లు అమలుకాకపోయినా పార్టీ పరంగా చేస్తామంటున్న కాంగ్రెస్, బీజేపీ
- మరి బీఆర్ఎస్ ఏం చేయబోతున్నది?
- కవిత వ్యాఖ్యలు బీఆర్ఎస్ వ్యాఖ్యలని భావించవచ్చా?

జనం పవర్, హైదరాబాద్ :

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు తమ వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఈ అంశంపై విభిన్న వైఖరులు అవలంబిస్తూ ఒకరినొకరు ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వైఖరిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి, ముఖ్యంగా ఆ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత సొంతంగా తీసుకుంటున్న స్టాండ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

..మిగతా 2లో

ఉత్తమ్ పై కోమటిరెడ్డి ఆగ్రహం

- బేగంపేట విమానశ్రయం వద్ద అసంతృప్తి
- సాగర్ నీటి విడుదలకు ఇద్దరు కలిసి వెళ్లాల్సి ఉండగా..
- ఆలస్యంగా వచ్చిన మంత్రి ఉత్తమ్
- అలిగి వెళ్లిపోయిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

జనం పవర్, హైదరాబాద్ :

ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 590.00(312.04 టీఎంసీలకు) అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత..నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి

..మిగతా 2లో

స్థానికులకే జూబ్లీహిల్స్ టికెట్

- నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
- ఉప ఎన్నికపై మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు

2

కూటమి వేధింపులపై ఫిర్యాదులకు యాప్

పీఏసీ సమావేశంలో ప్రకటించిన వైయస్ జగన్

2

మూసీపై అక్రమ పార్కింగ్

రంగంలోకి దిగిన హైడ్రా
ఆక్రమణలు తొలగించిన అధికారులు

జనం పవర్, హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ వద్ద మూసీ నదిపై ఏర్పాటైన అక్రమ పార్కింగ్ స్థలాన్ని హైడ్రా అధికారులు తొలగించారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు మూసీ నదిలో మట్టి పోసి అక్కడ పార్కింగ్ స్థలాన్ని సృష్టించారు. ఆ ప్రదేశంలో వాహనాలను నిలిపిన ప్రతి బస్సు నుంచి రూ.300, గుడిసెలు వేసుకున్న వారి నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తూ అక్రమంగా లాభాలు పొందుతున్నారు. ఈ విషయంపై స్థానికులు, వాహనదారులు హైడ్రా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన అధికారులు అక్కడి పరిస్థితిని పరిశీలించి, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం

..మిగతా 2లో

2

సరస్వతీ పవర్ షేర్ల బదిలీపై ఎన్సీఎల్టీ స్టే

వైయస్ జగన్‌కు భారీ ఊరట

2

నిండుకుండలా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

- జూలైలోనే నిండటం 18 ఏళ్లలో తొలిసారి
- గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన మంత్రులు

బీసీ బిల్లు కోసం 72 గంటల దీక్ష చేస్తా

2

Contact: 96181 81112

3

సరస్వతీ పవర్ షేర్ల బదిలీపై ఎన్సీఎల్టీ స్టే

జనం పవర్, హైదరాబాద్ :

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డికి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో ఊరట లభించింది. సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ షేర్ల బదిలీని నిలిపివేస్తూ ట్రైబ్యునల్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వైయస్ జగన్ తన తల్లి వైఎస్ విజయమ్మ, చెల్లెలు వైయస్ షర్మిలపై ఆరోపణలు చేస్తూ, షేర్లను తమ అనుమతి లేకుండా అక్రమంగా బదిలీ చేసుకున్నారని పేర్కొంటూ 2024 సెప్టెంబర్‌లో ఎన్సీఎల్టీని ఆశ్రయించారు. తనతో పాటు భార్య వైయస్ భారతి పేర్లలో ఉన్న షేర్లను సంతకాలు లేకుండా బదిలీ చేయడం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో తెలిపారు. కంపెనీ యాక్ట్ 59 కింద దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో విజయమ్మ, షర్మిలతో పాటు సండూర్ పవర్ లిమిటెడ్, జనార్ధన్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, రీజినల్ డైరెక్టర్ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌ను కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు. సుమారు 10 నెలలుగా అన్ని పక్షాల వాదనలు విన్న ట్రైబ్యునల్, ఈ నెల 15న తీర్పును రిజర్వు చేసి, ఈ రోజు జగన్ పక్షాన నిర్ణయం వెలువరించింది. సీబీఐ, ఈడీ విచారణలో ఉన్న కేసులు ముగియక ముందు షేర్ల బదిలీ జరగదని స్పష్టం చేస్తూ, బదిలీని తాత్కాలికంగా నిలిపివేసింది.

నిండుకుండలా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

- **జూలైలోనే నిండటం 18 ఏళ్లలో తొలిసారి**
- **గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన మంత్రులు**

జనం పవర్, హైదరాబాద్ :

ఎగువ నుంచి వస్తున్న భారీ వరదలతో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ నేడు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ప్రస్తుతం సాగర్‌కు 2,01,743 క్యూసెక్కుల వరద వస్తుండగా, 41,497 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 586.80 అడుగుల వద్ద నీటిమట్టం నమోదైంది. సాగర్ గరిష్ఠ నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 304.4680 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. జూలై నెలలోనే సాగర్ నిండుకుండలా కావడం 18 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం. మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టులోనూ భారీగా వరద ప్రవాహం కొనసాగుతుండటంతో 5 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఉత్తమ్‌పై కోమటిరెడ్డి ఆగ్రహం

- **బేగంపేట విమానశ్రయం వద్ద అసంతృప్తి**
- **సాగర్ నీటి విడుదలకు ఇద్దరు కలిసి వెళ్లాల్సి ఉండగా..**
- **ఆలస్యంగా వచ్చిన మంత్రి ఉత్తమ్**
- **అలిగి వెళ్లిపోయిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. సాగర్ గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందన్నారు. ‘‘నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం. సాగర్‌కు నెహ్రూ పునాది వేస్తే.. ఇందిరా గాంధీ ప్రారంభించారు. 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే గొప్ప ప్రాజెక్టు ఇది’’ అని పేర్కొన్నారు.

ఉత్తమ్‌పై కోమటిరెడ్డి ఆగ్రహం..!

ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నాగార్జున సాగర్ డ్యాం గేట్లు ఎత్తడానికి బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జిల్లా ఇంఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బయలుదేరాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ చేరుకున్నారు. అయితే.. 10 గంటల వరకు మంత్రి ఉత్తమ్ రాకపోవడంతో.. కోమటిరెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన అలిగి వెళ్లిపోయినట్లు సమాచారం.

కేసీఆర్.. మౌనం వీడరా?

- **బీసీ రిజర్వేషన్లపై మీ వైఖరి ఏమిటి?**
- **కాంగ్రెస్ పోరాటానికి మద్దతు ఇస్తారా లేదా?**
- **బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ పోరాటం**
- **మరి బీఆర్ఎస్ స్టాండ్ ఏమిటి?**
- **కవితను ముందుకుతోసి రాజకీయాలు చేస్తున్నారా?**
- **బీసీ రిజర్వేషన్లు అమలుకాకపోయినా పార్టీ పరంగా చేస్తామంటున్న కాంగ్రెస్, బీజేపీ**
- **మరి బీఆర్ఎస్ ఏం చేయబోతున్నది?**
- **కవిత వ్యాఖ్యలు బీఆర్ఎస్ వ్యాఖ్యలని భావించవచ్చా?**

(మొదటి పేజీ తరువాయి)

బీసీ రిజర్వేషన్ల నేపథ్యం

తెలంగాణ శాసనసభ 2025 మార్చి 17న బీసీ రిజర్వేషన్లను విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతానికి పెంచే బిల్లులను ఆమోదించింది. అయితే, ఈ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం ఇంకా రాకపోవడంతో, ఈ అంశం రాజకీయ రగడగా మారింది. తెలంగాణ హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలను 2025 సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని ఆదేశించడంతో ఈ విషయం మరింత ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్ వ్యూహం: బీసీలకు హామీల అస్త్రం

కాంగ్రెస్ పార్టీ తన 2023 కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని చెబుతున్నారు. అయితే, రాష్ట్రపతి ఆమోదం ఆలస్యం కావడంతో, కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 243D(6) కింద రిజర్వేషన్లను అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తోంది. ఈ చర్య ద్వారా కాంగ్రెస్, బీజేపీని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తోంది, బీసీలకు తామే నిజమైన సమర్థకులమని నిరూపించుకోవాలని చూస్తోంది.

కాంగ్రెస్ నాయకులు ఈ అంశంపై బీజేపీని లక్ష్యంగా చేసుకొని, కేంద్రంలో బీజేపీ బిల్లులకు ఆమోదం ఇవ్వకుండా ఆలస్యం చేస్తోందని ఆరోపిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ రిజర్వేషన్ల విజయం కాంగ్రెస్ ఘనతగా పేర్కొన్నారు, కవిత పాత్రను తోసిపుచ్చారు.

బీజేపీ స్థితి: రక్షణాత్మక వైఖరి

బీజేపీ నాయకులు, ముఖ్యంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, కాంగ్రెస్ బిల్లులలో చట్టపరమైన లోపాలు ఉన్నాయని, 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని దాటడం సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమని వాదిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 243D(6) కింద రిజర్వేషన్లను అమలు చేయవచ్చని, కేంద్ర ఆమోదం అవసరం లేదని బీజేపీ సూచిస్తోంది. అయితే, బీసీలకు మద్దతు ఇస్తున్నామని చెబుతూనే, ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ బీజేపీ రాజకీయ ధ్రువీకరణ వైఖరిని కొనసాగిస్తోంది.

బీఆర్ఎస్: అస్పష్టమైన వైఖరి, కవిత సొంత గొంతు

బీఆర్ఎస్ విషయంలో బీసీ రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి కనిపించడం లేదు. పార్టీ అధినేత కేసీఆర్ ఈ అంశంపై నోరు విప్పకపోవడం, పార్టీలో అంతర్గత విభేదాలను సూచిస్తోంది. బీఆర్ఎస్ నాయకురాలు కవిత మాత్రం బీసీ రిజర్వేషన్ల కోసం గట్టిగా పోరాడుతున్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన చర్చల ఆధారంగా ఆమె బీసీ కమిషన్‌కు 35 పేజీల నివేదిక సమర్పించారు, 42 శాతం రిజర్వేషన్ల అమలును డిమాండ్ చేశారు.

కవిత జులై 17న "రైల్ రోకో" ఆందోళన ప్రకటించి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఆమె కాంగ్రెస్, బీజేపీలను బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. అయితే, ఆమె సొంత పార్టీలోనే ఆమె పోరాటం పట్టించుకోకపోవడం, కేటీఆర్ ఆధ్వర్యంలో బీసీ నాయకులతో సమావేశాలు జరగడం ఆమె పాత్రను ప్రశ్నార్థకం చేస్తోంది. బీఆర్ఎస్ గత హయాంలో బీసీ రిజర్వేషన్లను తగ్గించిన చరిత్ర ఉండటంతో, ప్రస్తుతం ఆ పార్టీ ఈ అంశంపై నీతిమాలిని ప్రశ్నిస్తున్నారు. కవిత సొంతంగా తీసుకుంటున్న చొరవ, పార్టీలో ఆమె స్థానం, కేటీఆర్‌తో సంబంధాలపై అనేక ఊహాగానాలకు దారితీస్తోంది.

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం

స్థానిక సంస్థల ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో కీలకమైనవి. కాంగ్రెస్ ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తోంది, బీసీ రిజర్వేషన్లను అమలు చేసే ఘనత తమదేనని చెప్పుకోవాలని చూస్తోంది. బీజేపీ, బీసీలకు మద్దతు ఇస్తున్నామని చెబుతూనే, చట్టపరమైన అడ్డంకులను సాకుగా చూపుతోంది. బీఆర్ఎస్ మాత్రం ఈ విషయంలో అస్పష్టమైన వైఖరితో కనిపిస్తోంది, కవిత ఒక్కరే ఈ అంశంపై గట్టిగా మాట్లాడుతున్నారు.

ముగింపు

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధం తీవ్రంగా సాగుతోంది. కాంగ్రెస్ తమ హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుండగా, బీజేపీ చట్టపరమైన అడ్డంకులను ఎత్తిచూపుతోంది. బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు, కవిత సొంత గొంతు ఈ అంశాన్ని మరింత ఆసక్తికరంగా మార్చాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఈ రాజకీయ ఆటలో బీసీ ఓటర్ల మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది.

కూటమి వేధింపులపై ఫిర్యాదులకు యాప్

జనం పవర్, హైదరాబాద్ :

కూటమి ప్రభుత్వ వేధింపులపై ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేక యాప్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం వైసీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ మాట్లాడుతూ.. ప్రజలు లేదా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొనే అన్యాయాలను ఆధారాలతో కలిపి యాప్‌లో అప్‌లోడ్ చేయొచ్చని, వాటిపై పార్టీ డిజిటల్ సర్వర్‌లో ఆటోమేటిక్‌గా రికార్డ్ అవుతాయని చెప్పారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఫిర్యాదులపై విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. సీనియర్ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికించడం, ఎంపీలు, ఎమ్మెల్యేలను జైలుకు పంపడం అణచివేతకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమని పేర్కొంటూ, నందిగం సురేష్, కాకాణి గోవర్ధన్, అనిల్‌కుమార్ తదితరులపై కూడా కేసులు పెట్టడం రాజకీయ కక్షసాధన తప్ప మరేదీ కాదని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో అవినీతి పరాకాష్టకు చేరిందని, ఇసుక, లిక్కర్, మినరల్ మాఫియాలు, రేషన్ బియ్యం దోపిడీ, పేకాట క్లబ్బులు ప్రభుత్వ ఆశీర్వాదంతోనే నడుస్తున్నాయన్నారు. కొంతమంది డీఐజీలు, పోలీస్ అధికారులు కూడా కలెక్షన్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. మహిళలకు హామీ ఇచ్చిన పథకాలు అమలు కాలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని జగన్ విమర్శించారు. చంద్రబాబు ఏది విత్తారో అదే చెట్టు అవుతుందని, అన్యాయం చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయం అంటూ వైయస్ జగన్ హెచ్చరించారు.

మూసీపై అక్రమ పార్కింగ్

- **రంగంలోకి దిగిన హైడ్రా**
- **ఆక్రమణలు తొలగించిన అధికారులు**

(మొదటి పేజీ తరువాయి)

ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టారు. మూసీ నదిపై ఇలాంటి అక్రమ నిర్మాణాలు, వాడకాలు కొనసాగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, నీటి ప్రవాహం అంతరాయం కలగకుండా చూడటంతో పాటు ప్రజా వనరులను అక్రమంగా వినియోగించకుండా ఆపడమే లక్ష్యంగా హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

బీసీ బిల్లు కోసం 72 గంటల దీక్ష చేస్తా

జనం పవర్, హైదరాబాద్ :

బీసీ బిల్లు ఎంత అవసరమో దేశానికి చాటి చెప్పేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటల దీక్ష చేయనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష చేయనున్నట్టు చెప్పారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అన్ని పార్టీలతో వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో తలపెట్టిన ధర్నా కేవలం బిహార్ ఎన్నికలను దృష్టి పెట్టుకుని చేస్తున్న డ్రామా అని విమర్శించారు. బీసీ బిల్లు విషయంలో చేయాల్సిన పని చేయకుండా కాంగ్రెస్ పార్టీ సాగదీత ధోరణి అవలంభిస్తోందని మండిపడ్డారు. భాజపా నేతలు బీసీలకు అండగా ఉండాల్సిన సమయంలో తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు.

స్థానికులకే జూబ్లీహిల్స్ టికెట్

- **నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం**
- **ఉప ఎన్నికపై మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు**

జనం పవర్, హైదరాబాద్ :

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ స్థానికులకే ఇస్తామని, నియోజకర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్ లోని ఇందిరానగర్‌లో పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. స్థానిక ఉప ఎన్నికపై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. జూబ్లీహిల్స్ టికెట్‌ను స్థానికంగా పని చేసిన వారికి మాత్రమే ఇస్తామని పొన్నం స్పష్టం చేశారు. నాన్ లోకల్ అభ్యర్థులకు టికెట్ ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. పార్టీ అధిష్టానం ఎవరిని ఎంపిక చేసినా.. అందరూ కలిసి పనిచేస్తారని తెలిపారు. అభ్యర్థి ఎంపిక కోసం సర్వే జరుగుతోందన్నారు. తప్పకుండా జూబ్లీహిల్‌స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామనే ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గం నుంచి పలువురు నేతలు పోటీకి ఆసక్తి చూపుతున్నా, అభ్యర్థిత్వంపై పార్టీయే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. జూన్ 8న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి చెందడంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఆరు నెలలలోపు ఉప ఎన్నిక జరగాల్సి ఉండటంతో, సెప్టెంబర్‌లో షెడ్యూల్ విడుదలై అక్టోబర్ చివరలో ఎన్నికలు జరిగే అవకాశముంది.

నగరవాసులకు శుభవార్త..

కొత్త రేషన్ కార్డులపై మంత్రి పొన్నం ప్రభాకర్ నగరవాసులకు శుభవార్త చెప్పారు. ఆగస్టు ఒకటి నుంచి హైదరాబాద్‌లో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. 50 వేల రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కొత్తగా నగరంలో 2 లక్ష 50 వేల మంది పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కుబేరుల కోసం... ఫ్యామిలీ ఆఫీస్!

ఏ వ్యాపారాన్ని అయినా మార్కెట్ కదలికలే శాసిస్తాయి. ఎంతగొప్ప సంస్థకైనా ఏదో ఒక దశలో అవరోధాలు ఎదురవుతాయి. ఆ ప్రతికూలతలు కుటుంబాన్ని ప్రభావితం చేయకూడదంటే... వ్యాపార సంపదనూ, కుటుంబ సంపదనూ వేరువేరుగా చూడాలి. కంపెనీకి కార్పొరేట్ కార్యాలయం ఉన్నట్టే, కుటుంబానికి ఫ్యామిలీ ఆఫీస్‌ను ఏర్పాటు చేసుకోవాలి. భారతీయ కుబేర కుటుంబాలు ఆ ప్రయత్నంలోనే ఉన్నాయి. తన జీవితకాల కష్టం వృథాగా పోకూడదన్నది వ్యవస్థాపకుడి తపన. తామంతా రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టిన ఆస్తులు పదింతలు పెరగాలన్నది రెండోతరం కోరిక. తమ కుటుంబం సంప్రదాయ వ్యాపారాలకే పరిమితం కాకుండా, కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవాలన్నది మూడోతరం ఆకాంక్ష.

...అన్ని తరాల నమ్మకాన్నీ నిలబెట్టే బాధ్యతను ఫ్యామిలీ ఆఫీస్ తీసుకుంటుంది. ఇది కుబేరుల కుటుంబ కార్యాలయం. వయోజనులైన వారసులంతా ఇందులో సభ్యులే. ఆ ఆవరణలోనే పెట్టుబడులూ, న్యాయ సలహాలూ, వెంచర్ క్యాపిటల్ వ్యవహారాలూ... తదితర విభాగాలు ఉంటాయి. నిపుణులైన సిబ్బంది వాటిని పర్యవేక్షిస్తుంటారు. తరచూ సర్వసభ్య సమావేశాలు జరుగుతాయి. ఆ సందర్భంగా కొత్త ఇన్వెస్ట్‌మెంట్లూ, కొనబోతున్న ఆస్తులూ, సామాజిక బాధ్యతగా చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలూ... ఇలా అనేక విషయాలు చర్చకు వస్తాయి. అలా అని, మాటలకే పరిమితమైతే డైనింగ్ టేబుల్ కబుర్లకూ ఫ్యామిలీ ఆఫీస్ మీటింగులకూ తేడా ఏం ఉంటుంది? ఫ్యామిలీ ఆఫీస్‌కు పుష్కలమైన నిధులు ఉంటాయి. ఆ మొత్తం వందకోట్లు కావచ్చు, పదివేల కోట్లూ కావచ్చు. ఇప్పటికే ముంజల్, అదానీ, బర్మన్, ప్యాట్నీ, మారివాలా, రిలయన్స్, ఇన్ఫోసిస్, విప్రో, గోద్రెజ్... తదితర పరివారాలకు సకల సౌకర్యాలతో కుటుంబ కార్యాలయాలు ఉన్నాయి. జూలియస్ బేర్, ఈవై ఇండియా సంస్థల తాజా అధ్యయనం ప్రకారం... 2018లో యాభైలోపు ఉన్న భారతీయ ఫ్యామిలీ ఆఫీసుల సంఖ్య గత ఏడాది చివరి నాటికి మూడొందలకు చేరింది. ఈ ఆరేడు నెలల్లో ఇంకో పాతిక వరకూ కొత్తగా పుట్టుకొచ్చి ఉంటాయి. అమెరికా, చైనాల తర్వాత... కొత్త సంపన్నులు శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదే. ముందు నుంచీ అన్నీ కుటుంబ వ్యాపారాలే కాబట్టి, వ్యాపార సంపదనూ వ్యక్తిగత సంపదనూ వేరుచేసి చూడటం భారతీయులకు తెలియదు. దీంతో, ఫ్యామిలీ ఆఫీస్ అవసరమే లేకుండా పోయింది. కానీ, మారుతున్న పరిస్థితులూ మార్కెట్ అనిశ్చితులూ సంపన్నుల ఆలోచనల్ని పూర్తిగా మార్చేశాయి. కుటుంబ కార్యాలయాల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నాయి.

సంపద సంరక్షణకు...

పాత సంపన్నులకైనా, కొత్త కుబేరులకైనా... ఓ దశ తర్వాత సంపాదించినదాన్ని నిలబెట్టుకోవడమూ, వీలైతే మరింత అభివృద్ధి చేసుకోవడమూ ఓ సమస్యగా మారుతోంది. అలా అని, ప్రధాన వ్యాపారాల్ని పక్కన పెట్టి కుటుంబ లావాదేవీల మీదే దృష్టి సారించలేరు. దీంతో, ఫ్యామిలీ ఆఫీస్‌లాంటి ఓ వ్యవస్థ తప్పనిసరైంది. అందులోనూ, ఆర్థిక సరళీకరణ తర్వాత 'సిరి తావచ్చిన వచ్చును...' అన్నట్టు వివిధ మార్గాల్లో కుబేరుల ఖాతాల్లోకి డబ్బు వచ్చిపడుతోంది.

కొన్నిసార్లు... ఆ కుటుంబ వ్యాపారం ఏ బహుళజాతి సంస్థనో ఆకట్టుకుంటుంది. భాగస్వామ్యానికి ముందుకొస్తుంది. కాదనడానికి కారణం కనిపించదు. అలా, ఊహించనంత నగదు చేతికి అందుతుంది. ఆ సొమ్మును ఎలా సద్వినియోగం చేసుకోవాలి?

కొన్నిసార్లు... ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వల్ల కుటుంబ వాటాల విలువ అనూహ్యంగా పెరిగిపోతుంది. అందులో ఐదు శాతమో, పది శాతమో నగదు చేసుకున్నా వందలకోట్లు వచ్చి పడతాయి. అంత డబ్బును బ్యాంకు ఖాతాలో నిరుపయోగంగా ఉంచుకోలేరు. మరి, తక్షణ కర్తవ్యం?

కొన్నిసార్లు... తాతముత్తాతల కాలం నుంచీ భూములూ, స్థలాలూ, భవనాలూ, ఫిక్స్‌డ్ డిపాజిట్లూ.. తదితర రూపాల్లో సమకూర్చుకున్న ఆస్తిపాస్తుల్ని సురక్షితమైన మార్గాల్లో రేపటి తరాలకు అందించాలని కుటుంబ పెద్ద భావించవచ్చు. అదెలా అన్నది అసలు ప్రశ్న!

కొన్నిసార్లు... భవిష్యత్తు అవసరాల కోసం, వార్షిక లాభాల్లోంచి కొంత శాతాన్ని పక్కన పెట్టాలని వ్యాపార కుటుంబాలు తీర్మానిస్తాయి. అలా ఓ నాలుగైదేళ్ల నాటికి భారీ మొత్తం పోగవుతుంది. దాన్ని రెట్టింపు చేయడానికి ఓ వ్యూహం అవసరం అవుతుంది. ఆ చిట్కా ఎవరు చెబుతారు?

... ఈ సమస్యలన్నింటికీ ఫ్యామిలీ ఆఫీస్‌లో పరిష్కారం ఉంది. భారతీయ సంపన్న కుటుంబాలు సగటున ఐదొందల కోట్ల రూపాయల వరకూ ఫ్యామిలీ ఆఫీస్‌కు కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కుటుంబ కార్యాలయం పెట్టుబడుల విలువ పదివేల కోట్ల పైమాటేనని అంచనా. సభ్యుల తీర్మానం ప్రకారం... ఆ ఆఫీసులు అందుబాటులో ఉన్న నిధుల్ని షేర్స్, మ్యూచువల్ ఫండ్స్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, వెంచర్ క్యాపిటల్, రియల్ ఎస్టేట్ తదితర మార్గాల్లో మదుపు దిశగా మళ్లిస్తున్నాయి. కుటుంబం అంటేనే నమ్మకం. ఇంకెవరి కంపెనీలోనో డబ్బు పెట్టినప్పుడు దుర్వినియోగానికి ఆస్కారం ఉంటుంది. ఇక్కడ ఆ సమస్యే రాదు. కుటుంబ సంక్షేమం కోసం, కుటుంబ సభ్యులే ప్రతినిధులుగా ఏర్పాటైన వేదిక కాబట్టి, ప్రతి ఒక్కరిలోనూ 'మనదీ' అనే భావన ఉంటుంది. ఆ సమష్టితత్వమే ఫ్యామిలీ ఆఫీస్‌కు బలం.

ఇతర బాధ్యతలూ...

పెట్టుబడుల్ని పర్యవేక్షించడం ఒక్కటే అయితే ఒకరిద్దరు కన్సల్టెంట్లు సరిపోతారు. ఫ్యామిలీ ఆఫీస్ అవసరమే ఉండదు. నిజానికి, ఆ కార్యాలయం బాధ్యత ఇక్కడితో తీరిపోదు. సరిగ్గా ఇక్కడే మొదలవుతుంది. ఫ్యామిలీ ఆఫీస్... యాజమాన్యం ఆదేశాలతో వారసుల పైచదువుల కోసం పేరున్న విదేశీ విశ్వవిద్యాలయాల్ని ఎంపిక చేస్తుంది. నియమావళిని అనుసరించి, పిల్లల చదువులకు ఉమ్మడి ఖాతాలోంచి నిధులను సమకూరుస్తుంది. యాజమాన్యం కోరితే, సభ్యుల విదేశీ పౌరసత్వాల కోసమూ ప్రయత్నాలు చేస్తుంది. ఆధునిక జీవితాల్లో వివాహ బంధానికి భరోసా తగ్గుతోంది. ఇక కలిసి ఉండలేమనే ఆలోచన రావడమే ఆలస్యం, విడాకులకు సిద్ధపడుతున్నారు. ఆ వివాదాలు కోర్టుల వరకూ వెళ్తున్నాయి. భరణాల రూపంలో భారీ మొత్తాన్ని సమర్పించుకోవాల్సి వస్తుంది. దీనివల్ల కుటుంబ సంపద హారతి కర్పూరంలా కరిగిపోయే ప్రమాదం ఉంది. సమస్య అంత వరకూ రాకుండా... న్యాయ నిపుణుల సాయంతో యజమాని కుటుంబానికి చట్టపరమైన రక్షణ కవచాన్నీ నిర్మిస్తుంది. సభ్యుల వ్యాపార ప్రయాణాలకూ, విహార యాత్రలకూ ఏర్పాట్లు చేస్తుంది. ఎవరికైనా శత్రువుల నుంచో సంఘ విద్రోహక శక్తుల నుంచో ముప్పు ఉన్నప్పుడు, భద్రతా వ్యవహారాల్నీ పర్యవేక్షిస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య చిన్నాపెద్దా వివాదాలు తలెత్తినప్పుడు... కౌన్సెలర్ల సాయంతో అపోహల్ని తొలగించే ప్రయత్నం చేస్తుంది. ఆస్తుల విభజన అనివార్యం అయినప్పుడు, సదరు సభ్యుడికి తన వాటాకింద అందాల్సిన మొత్తాన్ని నయాపైసాతో సహా లెక్కగట్టి సెటిల్ చేస్తుంది. అవసరమైతే, అదుపు తప్పుతున్న ఖర్చుల గురించీ హద్దులు మీరుతున్న విలాసాల గురించీ కుటుంబ సభ్యుల్ని సున్నితంగా హెచ్చరిస్తుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ వ్యవహారాల్నీ ఈ కార్యాలయమే చూసుకుంటుంది. ఆ పరివారానికి కుటుంబ రాజ్యాంగం కనుక ఉంటే, దాని అమలు బాధ్యత కూడా ఫ్యామిలీ ఆఫీసుదే. అలా, యజమాని కుటుంబంలో ఒక సభ్యుడిలా కలిసిపోతుంది. నమ్మిన బంటులా వ్యవహరిస్తుంది.

కలల వేదిక...

ఇనుముఉక్కు, చక్కెరసిమెంటు, ఎరువులురసాయనాలు... పాతతరం ఆలోచనలన్నీ ఇలాంటి తయారీ రంగాల చుట్టూనే తిరిగేవి. జెన్‌జెడ్ మాత్రం భారీ పరిశ్రమల పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కొత్త కంపెనీలు పెట్టి కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్ తదితర విభాగాల్లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఆరాటపడుతోంది. తండ్రులూ తాతలూ నిర్లక్ష్యం చేసిన స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ల వైపూ దృష్టి సారిస్తోంది. ఆ ప్రయత్నాలకూ, ప్రయోగాలకూ కుటుంబ కార్యాలయాలు సాయం చేస్తున్నాయి. 'ఫ్యామిలీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఫండ్' నుంచి ఇన్‌హౌస్ స్టార్టప్స్‌కు వనరులు సమకూరుస్తున్నాయి. ఆమాటకొస్తే, పాతతరం కూడా... సంప్రదాయ వ్యాపారాల నుంచి పూర్తిగా బయటికి రాకుండానే... వినూత్నమైన ఆలోచనల్ని ప్రోత్సహించాలని భావిస్తోంది. ఫ్యామిలీ ఆఫీస్ నేతృత్వంలోని వెంచర్ క్యాపిటల్ విభాగం ద్వారా బయటి అంకురాల్లో పెట్టుబడులు పెడుతోంది. ప్రేమ్‌జీ తన ఫ్యామిలీ ఆఫీస్ నిధుల నుంచి 'స్లీప్ కంపెనీ', 'మింటిఫై' లాంటి యాభైకి పైగా స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. హల్దీరామ్ కుటుంబ పెద్దలు క్విక్ డెలివరీ సంస్థ 'జెప్టో'కు నిధులు సమకూర్చారు. ఆనంద్ మహీంద్రా తన ఫ్యామిలీ ఆఫీస్ ద్వారానే పదహారు కంపెనీల్లో పెట్టుబడి పెట్టారు. ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్ ఫ్యామిలీ ఆఫీస్ ఏకంగా వందమంది ఆంత్రప్రెన్యూర్లకు అండగా నిలిచింది. నారాయణమూర్తి తన ఫ్యామిలీ ఆఫీస్... 'కాటమరాన్ వెంచర్స్' ద్వారా ఇప్పటి వరకూ రెండొందల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. అంబుజా సిమెంట్ వ్యవస్థాపకులు నరోతమ్ కుటుంబం ఏర్పాటు చేసుకున్న నరోతమ్ సెఖ్‌సరియా ఫ్యామిలీ ఆఫీస్ 'గరుడా ఏరోస్పేస్'కు మేమున్నామనే భరోసాను అందించింది. కుటుంబ కార్యాలయాల అండ లేకపోతే, ఇందులో సగానికి సగం అంకురాలు మొక్కగా ఉన్నప్పుడే రాలిపోయేవేమో. కొత్త కుర్రాళ్ల ఐడియాలోని మెరుపును గుర్తించి, ప్రాణవాయువులాంటి పెట్టుబడిని సమకూర్చడం ద్వారా ఫ్యామిలీ ఆఫీస్‌లూ బాగానే లాభపడుతున్నాయి. ఆయా స్టార్టప్స్ మార్కెట్ విలువ పెరిగేకొద్దీ వాటి సంపదా వృద్ధి చెందుతోంది. అప్పట్లో, దమానీల కుటుంబ కార్యాలయం నిధులు సమకూర్చిన విషయాన్ని 'ఓయో' రితేష్ అగర్వాల్ తరచూ గుర్తుచేసుకుంటూ ఉంటాడు. తనకంటూ ఓ జీవితాన్ని ఇచ్చిన ఫ్యామిలీ ఆఫీస్ వ్యవస్థ రుణం తీర్చుకునే ప్రయత్నం కావచ్చు, తానూ ఓ ఫ్యామిలీ ఆఫీస్‌ను ఆరంభించి అనేక అంకురాల్ని ప్రోత్సహిస్తున్నాడు రితేష్.

పగ్గాలు ఎవరికి?

వాణిజ్య రాజధాని కుబేరుల రాజధాని కూడా. అధికశాతం కుటుంబ కార్యాలయాలు ముంబయిలోనే ఉంటున్నాయి. హైదరాబాద్, పుణె, అహ్మదాబాద్, బెంగళూరు తదితర నగరాల నుంచి కూడా కొన్ని పనిచేస్తున్నాయి. ముకేశ్ అంబానీ ముంబయితోపాటు సింగపూర్‌లోనూ ఓ ఆఫీసు ఏర్పాటు చేశారు. అంబుజా కుటుంబానికి లండన్‌లో అంతర్జాతీయ కార్యాలయం ఉంది. నారాయణమూర్తి 'కాటమరాన్' రెండు విదేశీ ఆఫీసుల ద్వారా కూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ నిర్ణయమూ వ్యూహాత్మకమే. దేశీయ కార్యాలయాల్ని తమ కుటుంబానికి అనువైన చోట ఏర్పాటు చేసుకుంటున్నా, అంతర్జాతీయ ఆఫీసుల విషయానికి వచ్చేసరికి... విదేశీ పెట్టుబడులకు అనువైన ప్రాంతాలకే ఓటేస్తున్నారు. ప్రత్యేకించి కార్పొరేట్ పన్నుల బాదుడు తక్కువగా ఉన్న దేశాల్ని ఏరికోరి ఎంచుకుంటున్నారు. ఒక్క సింగపూర్‌లోనే విశ్వ సంపన్నులకు చెందిన ఏడెనిమిది వందల ఫ్యామిలీ ఆఫీసులు ఉన్నట్టు అంచనా. గాంధీనగర్‌అహ్మదాబాద్‌ల నడుమ నిర్మించిన... గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ (గిఫ్ట్ సిటీ) సింగపూర్‌ను మించిన సౌకర్యాలతో, ఆకట్టుకునే పన్ను మినహాయింపులతో మన దేశంలోనే కుటుంబ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. ఇక, ఫ్యామిలీ ఆఫీసుల నిర్వహణ విషయానికొస్తే... కొన్ని కుటుంబాలు పూర్తిగా నిపుణులకే వదిలేస్తున్నాయి. నారాయణమూర్తి ఆ బాధ్యతను దీపక్ పడాకి అనే ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడి చేతిలో పెట్టారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఆశీర్వాద్ పైప్స్ వ్యవస్థాపకుల కుటుంబం... తమ పరివారానికే చెందిన యశ్ పోద్దార్‌కు సర్వాధికారాలూ కట్టబెట్టింది. 'ఓ బెల్జియం కంపెనీకి వాటాలు విక్రయించడం వల్ల మాకు పెద్దమొత్తంలో నగదు లభించింది. అప్పుడే, కుటుంబ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. మరింత సమాచారం కోసం నిపుణులతో మాట్లాడాను. పాశ్చాత్య దేశాల్లో ఫ్యామిలీ ఆఫీసులు ఎలా పనిచేస్తున్నాయన్నదీ తెలుసుకున్నాను. అక్కడ వందేళ్ల నుంచే ఈ వ్యవస్థ ఉంది' అంటారు యశ్. జాగరణ్ గ్రూప్ ఫ్యామిలీ ఆఫీసును కూడా ఆ కుటుంబానికే చెందిన ఆర్తీ గుప్తా పర్యవేక్షిస్తున్నారు. తను ఐఐటీకాన్పూర్‌లో చదువుకున్నారు. మొదట్లో, సెలవులకు ఇంటికొచ్చినప్పుడు తండ్రి వ్యక్తిగత పెట్టుబడుల్ని సమీక్షించేవారు. ఆ తర్వాత, కుటుంబ సభ్యుల సూచనతో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని, ఉమ్మడి సంపదకు సంరక్షకురాలిగా మారారు. కొటక్ గ్రూప్ ఫ్యామిలీ ఆఫీసు... యూఎస్‌కే క్యాపిటల్‌ను ఆ కుటుంబ వారసుడు ఉదయ్ కొటక్ స్థాపించారు. తనే నిర్వహిస్తున్నారు.

చాలా ఫ్యామిలీ ఆఫీసులకు అనుబంధంగా దాతృత్వ విభాగాలు పనిచేస్తున్నాయి. క్రిస్ గోపాలకృష్ణన్ తన కుటుంబ కార్యాలయం 'ప్రతీక్ష' ద్వారా మెదడు పనితీరుపైన లోతైన అధ్యయనాలు చేపట్టడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు రెండువందలా యాభై కోట్ల రూపాయల విరాళం ప్రకటించారు. విప్రో అధినేత ఫ్యామిలీ ఆఫీస్ నుంచి కూడా దాతృత్వ కార్యక్రమాలకు పెద్దమొత్తంలో నిధులు వెళ్తాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి టెన్త్, ఇంటర్ పాసైన రెండున్నర లక్షలమంది బాలికలకు పెద్ద చదువుల కోసం రూ. 30 వేల చొప్పున ఆర్థిక సాయం చేయనున్నట్టు ప్రేమ్‌జీ ప్రకటించారు. నారాయణమూర్తి తన కాటమరాన్ లాభాల్లో కొంత శాతాన్ని ఫౌండేషన్‌కు మళ్లిస్తారు. ఫ్యామిలీ ఆఫీసులు తీసుకుంటున్న ఆ చొరవ అనేక నిరుపేద కుటుంబాల కష్టాలు తీరుస్తోంది.

డబ్బు మహా చెడ్డది... కుటుంబాన్ని విడదీస్తుందని అంటారు. అదే డబ్బు ఇక్కడ తరాలపాటూ కలిపి ఉంచుతోంది. కలిసి ఎదిగేలా ప్రోత్సహిస్తోంది. వ్యక్తులుగా వేరువేరు ఆలోచనలు ఉన్నా, కుటుంబంగా ఒక లక్ష్యం కోసం పనిచేయడం సాధ్యమేనని నిరూపిస్తోంది. ఫ్యామిలీ ఆఫీస్ సృష్టిస్తున్న అత్యంత విలువైన సంపద ఇదే!

సెలెబ్రిటీలూ...

చాలామంది సినీ, క్రీడారంగ దిగ్గజాలకు కుటుంబ కార్యాలయాలు ఉన్నాయి. బిగ్‌బి అమితాబ్ తన ఫ్యామిలీ ఆఫీసు ద్వారా అప్పట్లోనే 'జస్ట్ డయల్'లో ఇన్వెస్ట్ చేశారు. క్రౌడ్ ఫండింగ్ వేదిక 'కెట్టో'కూ నిధులు సమకూర్చారు. క్రికెటర్ యువరాజ్ సింగ్ 'యు వియ్ కాన్' పేరుతో ఫ్యామిలీ ఆఫీసును నిర్వహిస్తున్నారు. క్యాన్సర్‌పై పోరాటానికి ఇక్కడి నుంచి కూడా నిధులు వెళ్తాయి. దీపిక పదుకొణె, సచిన్ తెందూల్కర్, విరాట్ కోహ్లీ, హృతిక్ రోషన్‌ల కుటుంబ కార్యాలయాలూ చురుగ్గానే వ్యవహరిస్తున్నాయి. బాలీవుడ్‌లో అత్యంత ఖరీదైన ఫ్యామిలీ ఆఫీస్ షారుక్ ఖాన్‌దే కావచ్చు. ఆయన పెట్టుబడులు రియల్ ఎస్టేట్ సంస్థలకూ విస్తరించాయని మార్కెట్ వర్గాల సమాచారం.

అనేక రకాలు

ఫ్యామిలీ ఆఫీసులు మూడు రకాలు. మొదటిది సింగిల్ ఫ్యామిలీ ఆఫీస్. పేరుకు తగ్గట్టే, ఒకే కుటుంబానికి సంబంధించిన వ్యవహారాల్ని పర్యవేక్షిస్తుంది. సొంతంగా ఫ్యామిలీ ఆఫీస్ నిర్వహణ అంటే మాటలు కాదు. లక్షలకొద్దీ జీతాలతో నిపుణుల్ని నియమించుకోవాలి. సమావేశానికి హాజరైన ప్రతిసారీ కన్సల్టెంట్లకు భారీగా పారితోషికాలు ముట్టజెప్పాలి, కార్యాలయ నిర్వహణ వ్యయాలు ఉండనే ఉంటాయి. ఏటా పదిహేను నుంచి ఇరవై కోట్లు కేటాయించాల్సిందే. కనీసం వెయ్యి కోట్ల బడ్జెట్ ఉన్న పరివారాలే ఇంత ఖర్చును భరించగలవు. ఆ పరిమితిని అధిగమించడానికి పుట్టుకొచ్చిందే... మల్టీ ఫ్యామిలీ ఆఫీస్. ఒకే కార్యాలయంలో పదో పాతికో కుటుంబాల వ్యవహారాల్ని నిర్వహిస్తారు. దీనివల్ల ఆయా కుటుంబాలకు ఖర్చు తగ్గుతుంది. కాకపోతే, గోప్యతకు ఆస్కారం తక్కువ. వర్చువల్ ఫ్యామిలీ ఆఫీస్... ఇటీవలి కాలంలో ప్రచారంలోకి వచ్చింది. దీనికి ప్రత్యేకించి ఓ కార్యాలయం అంటూ ఉండదు. ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడు ఒకచోటా, న్యాయ నిపుణుడు ఒకచోటా, చార్టర్డ్ అకౌంటెంట్ ఒకచోటా ఉంటారు. ఆన్‌లైన్‌లోనే సేవలు అందిస్తారు. ఇది మరింత చవకైన మార్గం.

మిడిల్‌క్లాస్ ఫార్ములా...

కుబేరుల సంపదలు వేలకోట్లలో ఉంటాయి. సామాన్యుల ఆస్తులు లక్షల్లోనో, ఒకట్రెండు కోట్లలోనో ఉంటాయి. కరెన్సీ లెక్కల్ని మినహాయిస్తే... కుటుంబం కుటుంబమే. ఎవరి ఇంట్లో అయినా భిన్నాభిప్రాయాలూ భేదాభిప్రాయాలూ తప్పవు. అక్కడక్కడా తోబుట్టువులు భాగస్వామ్య వ్యాపారాలూ చేస్తుంటారు. బిజినెస్ అన్నాక అపోహలకూ అనుమానాలకూ ఆస్కారం ఎక్కువే. ముఖ్య నిర్ణయాల్లో పారదర్శకత కోసం ఆ కుటుంబాలు ఫ్యామిలీ ఆఫీస్ ఫార్ములాను యథాతథంగా అన్వయించుకోవచ్చు. ఏ చిన్న సమస్య ఎదురైనా మనసు విప్పి మాట్లాడుకోవడం, ఏవైనా సందేహాలుంటే నేరుగా అడిగి తీర్చుకోవడం ... వ్యాపార, వ్యక్తిగత బంధాల బలోపేతానికి ఉపకరించే మార్గాలు. వీలైతే కుటుంబం నేతృత్వంలో పదిమందికీ ఉపయోగపడే మంచిపనుల్నీ చేపట్టవచ్చు. వ్యక్తిగా సమకూర్చుకోలేని పెద్ద ఆస్తుల్ని ఓ కుటుంబంగా సొంతం చేసుకోవచ్చు. కుటుంబ రాజ్యాంగాన్నీ రాసుకోవచ్చు.

రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

జనం పవర్, గంగాధర, జూలై 29: రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ కార్డులు అందజేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. స్థానిక జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో గంగాధర మండలానికి చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు ఉత్తర్వులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఒక ఆత్మ గౌరవమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డు అందిస్తోందన్నారు. కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరమని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, నియోజకవర్గంలో తొలివిడతగా 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రానున్న కాలంలో ప్రతి అర్హునికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని అన్నారు. నారాయణపూర్ జలాశయం కుడికాలువ పనులను ఆరునెలల్లో ప్రారంభించనున్నామని తెలిపారు. దీనివల్ల సాగు విస్తీర్ణం పెరిగి చొప్పదండి నియోజకవర్గం మరింత సస్యశ్యామలం అవుతుందని అన్నారు. రైతుల శ్రేయసే లక్ష్యంగా సాగుకు ముందే ఒకేసారి 9,000 కోట్ల రైతు భరోసా సొమ్ము రైతు ఖాతాలో జమ చేసామని, 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో 78 వేల 500 కు పైగా కొత్త రేషన్ కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పు చేర్పులు చేశామని తెలిపారు. ఒక గంగాధర మండలంలోని 5,516 రేషన్ కార్డులు మంజూరయ్యాయని, ఈ కార్డుల ద్వారా 10వేల 816 మందికి ప్రతినెలా 64.896 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. రేషన్ కార్డుల్లో మహిళల పేరు నమోదు అవ్వడమే కాకుండా, కుటుంబ రేషన్ కార్డులో యజమానిగా ఉండడం మంచి విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్, వైస్ చైర్మన్ కరుణాకర్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తిరుమల రావు, తహసిల్దార్ అనుపమరావులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు పోరాడి
తమ హక్కులను సాధించుకోవాలి

జనం పవర్, జమ్మికుంట, జూలై 29: మున్నూరు కాపులు ఐకమత్యంతో పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని, మున్నూరు కాపు సన్మిత్ర ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షులు మర్రి అవినాష్ అన్నారు. మంగళవారం మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనగంటి మల్లయ్య, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు ఏబూసి శ్రీనివాస్‌లను మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామ మున్నూరు కాపు సన్మిత్ర ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొనగంటి మల్లయ్య, ఏబూసి శ్రీనివాస్‌లు మాట్లాడారు. మున్నూరు కాపుల ఐక్యత కొరకు పాటు పడతామన్నారు. మున్నూరు కాపులను ఏకతాటి పైకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సన్మిత్ర సంక్షేమ సంఘం సభ్యులు మర్రి అవినాష్, డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏబూసి శ్రీనివాస్, పొనగంటి సంపత్, ఏ బూసి శ్రీనివాస్ (విద్యోదయ) వేల్పుల రాజేందర్, ఏబూసి సతీష్, ఉడుగుల సంపత్, బోనగిరి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో పతకాలు సాధించిన
ఎస్సీ గురుకుల విద్యార్థులు

జనం పవర్, మిర్యాలగూడ, జూలై 29: మిర్యాలగూడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకులానికి చెందిన విద్యార్థులు బాక్సింగ్ పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. విద్యార్థులను మంగళవారం గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావత్ కృష్ణ నాయక్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 25న షేక్ పేటలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలలో 10వ తరగతి విద్యార్థి పి.సాయి సిద్దార్థ 61-65 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించగా, 49-52 కేజీల విభాగంలో డి.దేవా వెండి పతకం సాధించాడు. భవిష్యత్తులో మరింత ప్రతిభ చూపుతూ, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించి గురుకులానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పిడివి. ఆంజనేయులు, పిఈటి ఏకస్వామిలను అభినందించారు.

గురుకులాలను తనిఖీ చేసిన కలెక్టర్

జనం పవర్, గంగాధర, జూలై 29: గంగాధరలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను, మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. బీసీ బాలుర వసతి గృహంలో తరగతి గదులను, స్టోర్ రూమును, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులు కూర్చుండేందుకు సరఫరా చేసిన గ్రీన్ మ్యాట్లను ఉపయోగించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం నుండి సరఫరా ఆయన ప్రతి వస్తువును విద్యార్థుల కోసం వినియోగించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశ్రాంతి తీసుకుంటున్న పలువురు విద్యార్థులతో మాట్లాడారు. జ్వరం, ఇతర అనారోగ్యం వస్తే అప్రమత్తంగా ఉండాలని హాస్టల్స్ సిబ్బందికి సూచించారు. నిర్దిష్ట సమయం ప్రకారం వైద్యాధికారితో ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఈసందర్భంగా మెడికల్ రిజిస్టర్ను తనిఖీ చేసి విద్యార్థులకు ఇచ్చిన మందులను పరిశీలించారు. విద్యార్థులకు ఓఆర్ఎస్ ద్రావణం అందజేయాలని అన్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఇక్కడ వంటగది సరుకుల గదిని తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు ఇవ్వాలని ఆదేశించారు. తరగతి గదులు పరిశీలించిన కలెక్టర్ ఆరవ తరగతి విద్యార్థులను ఇంగ్లీష్‌కు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కలెక్టర్ వెంట బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్ ఉన్నారు.

కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

జనం పవర్, హుజురాబాద్, జూలై 29: హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేద కుటుంబాల పెళ్లిళ్ల కోసం కార్యక్రమం చాలా మంది జీవితాల్లో ఆసరా అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులతోపాటు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

జనం పవర్, మంథని, జూలై 29: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో ఉదయం 11.30 గంటల వరకు ఆర్ఎంఓ డాక్టర్ టి.వి. రాజశేఖర్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. రాజశేఖర్, ఎం.ఎన్.ఓ శంశీర్‌ఖాన్, ఎన్‌సిడి కాంట్రాక్ట్ ఉద్యోగి సాహితీ ప్రియలు విధులకు హాజరు కాకపోవడాన్ని జిల్లా కలెక్టర్ గమనించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం లేదా సమయపాలన పాటించకుండా ఆసుపత్రికి లేటుగా రావడం, బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయకపోవడంపై మూడు రోజులలో వివరణ ఇవ్వాలని కలెక్టర్ మెమో జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని, ఆసుపత్రి విధులను వైద్య సిబ్బంది, వైద్యులు ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధా రాజేంద్ర

జనం పవర్, జమ్మికుంట, జూలై 29: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో, ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు (సమగ్రవ్యాధి నిర్ధారణ పరీక్షలు) నిర్వహించారు. ఈ క్యాంప్‌లో ఐసిటిసి విభాగం పాల్గొని హెచ్ ఐవి, హెపటైటిస్‌బి వంటి పరీక్షలు చేసి గ్రామస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే ఆరోగ్య శాఖ సిబ్బంది బిపి, షుగర్, టిబి, మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేసి మందులు అందించారు. ఈశిబిరాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధా రాజేంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధా రాజేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు హెచ్ఐవి, హెపటైటిస్ బి, టిబి, షుగర్ పరీక్షలు విధిగా ప్రతి ఒక్కరూ చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ బిందు, మోహన్ రెడ్డి హెల్త్ హెడ్యుకేటర్, సూపర్వైజర్స్ అరుణ, దేవేందర్ రెడ్డి ఐ సి టి సి కౌన్సిలర్ మహిపాల్, ల్యాబ్ టెక్నీషియన్ ఇబ్రహీం, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం వాణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు
ముందస్తు చర్యలు తీసుకోవాలి

జనం పవర్, పెద్దపల్లి జూలై 29: వరిలో ప్రధానంగా ఉల్లికోడు, మొగి పురుగు లేదా గొట్టపు రోగం వంటివి ఆలస్యంగా నాట్లు వేయడంవల్ల సంభవిస్తాయి. నాట్లు సకాలంలో వేయడం వల్ల ఉల్లికోడు, మొగి పురుగు వంటి వాటి ప్రభావం తగ్గించి మంచి దిగుబడి పొందవచ్చు. అదే విధంగా, నాట్లు వేసిన మూడు నుండి ఐదు రోజు ల్లోపు ఎకరానికి ప్రేటిలక్లోర్ 600 మిల్లీలీటర్లు లేదా అక్సడయార్జిల్ 35 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి 20 నుండి 25 కేజీల పొడి ఇసుకలో కలిపి, పలచగా నీరు ఉన్న పొలంలో చల్లితే కలుపునివారణలో మంచి ఫలితాలు సాధించవచ్చు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి. శశిధర్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై కేంద్రానికి లేఖ

జనం పవర్, పెద్దపల్లి, జూలై 29: పీఎం కిసాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటూ ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ప్రధాన మంత్రి మోదీకి, వ్యవసాయ మంత్రి శివరాజ్ చౌహాన్‌కు లేఖ రాశారు. 2019 ఫిబ్రవరి తర్వాత భూములు కొనుగోలు చేసిన రైతులకు కూడా ఈ పథకం కింద పెట్టుబడి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రైతులు వర్షాభావం, నకిలీ విత్తనాలు, ధరల సమస్యలతో తీవ్రంగా నష్టపోతున్న వేళ, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. కొత్త పాస్‌బుక్స్ కలిగిన రైతులను కూడా పథకానికి అర్హులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు.

'ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి'



జనం పవర్, జమ్మికుంట, జూలై 29: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయసంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు కోరారు. సోమవారం జమ్మికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) ఆవరణలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వ ర్యంలో ఆగస్టు 1న కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో యుఎస్‌పిఎస్ భాగస్వామ్య సంఘాల వివిధ బాధ్యులు ఆవాల నరహరి (డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు), మర్రి అవినాష్ (టీపీటీఎఫ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు) కోడిగూటి తిరుపతి (టీపీటీఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి) వేణుమాధవ్, రాజేందర్, సదానందం, చంద్రశేఖర్, వనజ యేసుమణి, స్వామి, సంపత్‌లు పాల్గొన్నారు.

నూతన నియామకం

జనం పవర్, పెద్దపల్లి, జూలై 29: తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, వరంగల్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో గోదావరిఖని వాసి పోలవేణి నరేష్‌ను పెద్దపెల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం బీసీ సంఘం వేదికగా పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. తనకు ఈ బాధ్యత ఇచ్చిన బీసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

జనం పవర్, జగిత్యాల, జూలై 29: ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ, కోమటి కొండాపూర్, ఎర్దండి, కొజన్ కొత్తూర్, ములరాంపూర్, బర్తిపూర్, వేములకుర్తి, యమపూర్, తిమ్మాపూర్, గోధుర్, ఇబ్రహీం పట్నం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ. షాధి ముబారక్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కేసీఆర్ ఆడ బిడ్డకు పెళ్లిచేస్తే తల్లిదండ్రులకు కష్టం కాకుండా కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్నా 4000 పెన్షన్ ఇవ్వట్లేదని తులం బంగారం ఎక్కడని మహిళలు ప్రశ్నిస్తున్నారని దానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు.

నారాయణ హైస్కూల్‌లో విద్యార్థి క్యాబినెట్ ఎన్నికలు

జనం పవర్, కరీంనగర్ టౌన్, జూలై 29 : నారాయణ హైస్కూల్‌లో విద్యార్థి నేతృత్వ లక్ష్యాన్ని గుర్తించి, పాఠశాలలో డెమోక్రటిక్ విలువలను పెంపొందించేందుకు క్యాబినెట్ ఎన్నికలు ఎంతో ఉత్సాహ భరితంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల ఓట్ల ద్వారా కొత్త క్యాబినెట్ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం కొత్తగా ఎన్నుకోబడిన సభ్యులతో ఇన్వెస్టిచర్ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డిచే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన ప్రతినిధులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించనున్నట్లు ప్రతిజ్ఞ చేశారు. కార్య క్రమంలో నారాయణ పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి, డీజీఎం వెంకటరమణారెడ్డి ఏజీఎం చైతన్య రావు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొన్నం మాటలు బాధ్యతారహిత్యం

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు

జనం పవర్, జమ్మికుంట, జూలై 29: రైతులకు కావలసిన ఎరువులను సకాలంలో అందించడంలో ప్రభుత్వం పూర్తిగా వైపల్యం చెందిందని, కానీ మంత్రి పొన్నం ప్రభాకర్ తమకేమీ సంబంధం లేదన్నట్టుగా కేంద్ర ప్రభుత్వం సరైనటు వంటి ఎరువులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని అబద్ధాలు చెప్పడం అతని బాధ్యతరాహిత్యానికి నిదర్శనమని కరీంనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు సంపత్ రావు మండిపడ్డారు.

నిజాయితీ చాటుకున్న బాసర ఆలయ హోంగార్డ్

జనం పవర్, భైంసా, జూలై 29: శ్రావణమాసన్నీ పురస్కరించుకొని నాలుమూలల నుండి శ్రీ జ్ఞాన సరస్వతి దేవి దర్శనానికి వచ్చిన భక్తుల వల్ల దేవాలయం బాగా రద్దీగా మారింది. భక్తుల రద్దీతో ఆలయంలో మా గందరగోళం ఏర్పడడంతో శ్రీ సరస్వతి మాత దర్శనానికి వచ్చిన అనంతపురం జిల్లా చెందిన సుభద్ర తిరుగు ప్రయాణంలో తన బ్యాగును మర్చిపోయారు. అమ్మవారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఆలయ హోమ్ గార్డ్ గమనించి సుభద్ర బ్యాగును సుభద్రకు అందజేశారు. ఆలయ హోంగార్డ్లు తన నిజాయితీనీ చాటుకున్నారు. బ్యాగులో 15వేల రూపాయలు, స్మార్ట్ ఫోన్ ఉంది. నిజాయితీగా తన బ్యాగును తనకు అందించిన హోంగార్డులకు సుభద్ర ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాగు అందజేత సమయంలో అర్జున్ ,రాజేష్,సురేష్ అనే ముగ్గురు హోంగార్డ్లు ఉన్నారు.

భవిత కేంద్రం అభివృద్ధికి సహకరించాలి

జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29: కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రైటర్ బస్తీలో ఉన్న భవిత కేంద్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ సూచించారు. మంగళవారం భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభు దయాల్ తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన అన్నం తినే స్టీల్ ప్లేట్లను విద్యార్థులకు అందించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో భవిత కేంద్రాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. భవిత కేంద్రంలో కొందరు విద్యార్థులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రైటర్ బస్తీలో మధ్యాహ్న భోజన పథకంలో భోజనము స్వీకరిస్తున్నందున వారందరికీ స్టీల్ ప్లేట్స్ బహుకరించడం జరిగిందన్నారు. మెనూ పాటిస్తూ చక్కటి వేడివేడి భోజన పదార్థాలను విద్యార్థులకు అందించాలని హెడ్మాస్టర్‌కు డాక్టర్ ప్రభు దయాల్ సూచించారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు

జనం పవర్, నస్పూర్, జూలై 29: రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నస్పూర్ పట్టణం లోని తీగల పహాడ్ ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు స్కూల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ఉన్నత విద్యా తోనే ఉజ్వల భవిషత్తు ఉంటుందని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థిలకు దీటుగా రాణించాలని విద్యార్థులతో అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పీఎం శ్రీ పథకం కింద దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వ పాఠశాలలను స్మార్ట్ స్కూల్ లాగా ప్రతి పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి పేద ప్రజలకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ మరియు లా విద్యా సంస్థలను వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పేద ప్రజలకు విద్యను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమం లో సత్రం రమేష్, గాజుల ముఖేష్ గౌడ్, మిట్టపల్లి మొగిలి, చల్లా విక్రమ్, మాలోత్ జ్యోతి పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉద్యోగి మృతి

జనం పవం, బైంసా, జూలై 29: బైంసా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్(55) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఉద్యోగ నిమిత్తం ప్రతిరోజు హాస్పిటల్ వెళ్తున్న క్రమంలో ఆయనకు అస్వస్థతకు గురఅయ్యాడు. వెంటనే కుటుంబీకులు గమనించి దగ్గరలో ఉన్న హాస్పిటల్ కి తరలించారు. వైద్యులు పరీక్షించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాస్ మృతి పట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, వైద్య డాక్టర్ల బృందం, వైద్య సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలిపారు.

నాగదేవతకు పూజలు

జనం పవర్, బైంసా, జూలై 29: శ్రావణమాసం నాగపంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా నాగదేవత ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. మహిళలు నాగదేవత ఆలయాల్లో పుట్టలో పాలు పోసి, మొక్కలను చెల్లించుకున్నారు. కొన్ని ప్రాంతాలలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీలు సభ్యులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లును చేశారు. అలాగే బైంసా మండలంలోని మంర్జి గ్రామ శివారులో గల నాగదేవత ఆలయంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ నాగదేవతను దర్శించుకొని పుట్ట వద్ద వెళ్లి నాగదేవతలకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు భోజనాలు వడ్డించారు.

తేనెటీగల పెంపకంతో ఉపాధి

- మహిళలు ఆర్థికంగా ఎదగాలి
- సింగరేణి చైర్మన్ బలరాం
- ఉపాధి రంగాలపై శిక్షణ ఇస్తాం
- కలెక్టర్ జితేష్ పాటిల్

జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29: తేనెటీగల పెంపకం జీవనోపాధికి మార్గమని స్వచ్ఛమైన తేనెను ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేస్తే కుటుంబానికి ఎంతో భరోసా అని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో లబ్ధిదారులకు తేనెటీగల పెంపకం బాక్స్ ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు తేనెటీగల పెంపకం-తేనె ఉత్పత్తిపై శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. తేనెటీగల పెంపకం ఉత్పత్తి వలన ప్రతి మహిళ ఏడాదికి రూ.50 వేలు వరకు ఆర్థికంగా సంపాదించే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయం ద్వారానే కాకుండా మహిళలు ఇంటి వద్దనే తేనె టీగల నుంచి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. స్వచ్ఛమైన నాణ్యమైన తేనె మార్కెట్ చేసుకోవడం ద్వారా అధిక ఆదాయం వస్తుందన్నారు.

ఉపాధి రంగాలపై శిక్షణ ఇస్తాం

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వారికి ఉపాధి రంగంలో శిక్షణ ఇచ్చి కావాల్సిన పనిముట్లు కూడా అందించేందుకు కృషి చేస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వడం అభినందనీయ మన్నారు. అలాగే జిల్లాలో పలుచోట్ల ఇతర శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు వారి పొలాల లో మునగ సాగుచేస్తే మంచి ఆదాయం ఉంటుందని మునగతో పాటు అంతర్ పంటలు సాగు చేయడం వల్ల ఆదాయం పెరుగుతుందన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల ద్వారా మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. రైతులు తేనెటీగలు పెంపకంలో అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల మహిళలకు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు దోహదపడుతాయన్నారు. జిల్లాలో మేకపాల ఉత్పత్తి, చేపల పెంపకం మునగ సాగు లాంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రస్తావించారు. మంచి నాణ్యమైన తేనె ఉత్పత్తి చేస్తే మార్కెట్ ఈజీగా అవుతుందని నాణ్యతను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మార్కెట్ చేసే విధానంపై కూడా శిక్షణ ఇవ్వాలని ఈ విషయంలో సింగరేణి సంస్థ చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ డైరెక్టర్ గౌతమ్ పొట్రు, సింగరేణి డైరెక్టర్లు, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, జిఎంలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును తవ్వారు - వేయడం మరిచారు

జనం పవర్, ఇల్లంతకుంట, జూలై 29: ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వంతడుపుల బైపాస్ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ఒకవైపు పూర్తి చేశారు. మరోవైపు రోడ్డును తవ్వి వదిలేశారు. 20 రోజులు గడిచినా కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం చేపట్టటం లేదు. వైన్స్ ముందు మాత్రం రోడ్డును తవ్వకుండా వదిలేయడంలో మతలబు ఏంటో అని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. ఆ ఏరియాలో ఉన్న వ్యాపారస్తులకు,ప్రజలకు, వాహనదారులకు చాలా ఇబ్బంది అవుతుంది ఎంత చెప్పినా కూడా వినకుండా ఇదిగో చేస్తాం, అదిగో చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు.రోడ్డును తవ్విన గుంతల్లో డ్రైనేజి నీళ్లు నిలిచి దుర్వాసన వచ్చి,దోమలు వృద్ధి చెందుతున్నా కూడా సదరు కాంట్రాక్టర్ కాని,అధికారులు కాని స్పందించటం లేదు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు,వ్యాపారస్తులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యం

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలి
- స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగుదాం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా

జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29: ప్రజా సమస్యల పరిష్కారమే భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ప్రధాన ఎజెండా అని సమస్యల పరిష్కారం కోసం ఎందాకైనా ఎవ్వరితోనైనా పోరాటం చేసేందుకు సిద్ధం అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా తెలిపారు. మంగళవారం శేషగిరి భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంగా ఈనెల 26, 27 తేదీల్లో సిపిఐ జిల్లా 3వ మహాసభలు అత్యంత ఘనంగా జరిగాయని ఆ మహాసభల్లో ప్రధానంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నదీ జలాలు జిల్లాలోని ప్రతీ ఎకరాకు అందించాలని, కొత్తగూడెం ఇల్లెందుల్లో ఓపెన్ కాస్టు బొగ్గు గనులను తక్షణమే ప్రారంభించాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో కళాక్షేత్రాలు నిర్మించాలని నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యారంగానికి కేంద్ర బడ్జెట్లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించా లని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేస్తూ బకాయిలు విడుదల చేయాలని, ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయితీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో కలపాలని కోరారు. పేదల సాగులో ఉన్న మిగులు పోడు భూములకు పట్టాలివ్వాలని, జాతీయ ఉపాధిహామీ పథకంలో 200 పనిదినాలు రోజుకు రూ.600 చెల్లించాలని జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, జర్నలిస్టులు, అడ్వకేట్లకు నామినల్ ధరకే ఇండ్ల స్థలాలు అందించి ప్రభుత్వం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ మేరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలిపారు. మహిళలకు విద్య, వైద్య రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని మహిళ రక్షణ చట్టాలు సంక్షేమ చట్టాలు అమలు చేయాలని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, తెలంగాణ ఉద్యమ కారులకు 200 గజాల ఇల్లు, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అశ్వారావు పేట కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఆర్టీసీ డిపో, హార్టీకల్చర్ యూనివర్సిటీ, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని, పాల్వంచ కేంద్రంగా ఎరువుల కర్మాగారం కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని జిల్లాలో పెండింగ్లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని తెలిపారు. భద్రాచలం గోదావరి కరకట్ట నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి వరద ముంపు నుంచి గ్రామీణ ప్రాంతాలకు రక్షణ కల్పించాలనే తీర్మాణాలతో పాటు పలు తీర్మానాలు ఆమోదం పొందాయన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నూతన నాయకత్వం ముందుకు సాగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలుపుకోవాలని హామీల అమలు కాకుంటే ప్రశ్నించేందుకు వాటి సాధనకు వెనుకడుగు వేసేది లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, అసెంబ్లీ ఎన్నికల ఒప్పందంలో భాగంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఐక్యంగా పనిచేద్దామని బలమైన స్థానాల్లో గతంలో మాదిరిగానే మన సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్టి సలీం, మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, భూక్య దస్రు, వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, అడుసుమిల్లి సాయిబాబు, మువ్వా వెంకటేశ్వరరావు, కందుల భాస్కర్, బి వీరస్వామి, ఉప్పుశెట్టి రాహూల్, ఎస్ కే ఫహీమ్, అడ్డగర్ల తాతాజీతోపాటు కౌన్సిల్ సభ్యులు భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కడెం ఠాణాను సందర్శించిన ఎస్పీ

జనం పవర్, బైంసా, జూలై 29: నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల కడెం మండల కేంద్రంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిత తనిఖీ చేశారు. పలు రికార్డులను, పెండింగ్ కేసులు, దర్యాప్తు కేసులను పరిశీలించారు. నేరాల నివారణ, గంజాయి నిర్మూలన, సైబర్ నేరాల చైతన్యంపై దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో వరద ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, విపత్తు సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. మండలం పోలీస్‌స్టేషన్లో పరిశుభ్రత, క్రమ శిక్షణను క్లుప్తంగా వివరించారు. ఎల్లప్పుడు ప్రజల అందు బాటులో ఉండేలా చూడాలన్నారు. మండల కేంద్రంలో పెట్రోల్ నిర్వహిస్తూ ఉండాలన్నారు. వరద ప్రాంతాల్లో ఎల్లప్పు డూ పర్యవేక్షించాలని కోరారు. పోలీస్‌స్టేషన్ వచ్చిన ప్రతి ఒక్కరి కి మర్యాదపూర్వకంగా మాట్లాడి సలహా సూచనలివ్వాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

జనం పవర్, బైంసా, జూలై 29: ప్రభుత పాఠశాలలో చదివే ప్రతి ఒక్క విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల ఉపాధ్యాయులకు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. మంగళవారం కుబీర్ మండలంలోని దార్ కుబీర్ గ్రామంలో నూతన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మంచి డిగ్రీ చదివి ప్రభుత్వ ఉద్యోగం సంప్రదించిన ఉపాధ్యాయులతో చదువు,పౌష్టికమైన మధ్యాహ్న భోజనం, వేల రూపాయల ఖర్చుతో కూడిన పుస్తకాలు ఉచితమే ప్రభుత్వం అందిస్తుందన్నారు. సకల సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో ప్రతిఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రయోజకులై ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధిస్తారని పేర్కొన్నారు. ఏ ఉద్యోగంలోనైన ప్రభుత్వ పాఠశాలలు చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. దీంతోపాటు కుబీర్ మండల కేంద్రంలోనీ రైతు వేదికలో నూతన రేషన్ కార్డుల పంపిణీ ఎమ్మెల్యే చేశారు. ప్రతి ఒక్క రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందించడం చాలా గర్వకారణం అన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవారికి ఆహార భద్రత కల్పించి, ఉచితంగానే సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు లేదని ఉండకూడదన్నారు. ఎవరికైతే రేషన్ కార్డు లేదు వారు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ సమావేశంలో కుబీర్ మండల ఎమ్మార్వో శివరాజ్, ఎంపీడీవో సాగర్ రెడ్డి, ఎమ్మెల్యే తో పాటు తదితర రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

రోడ్లను పట్టించుకోండి

జనం పవర్, బెల్లంపల్లి, జూలై, 29: బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులు గుంతలతో అస్తవ్యస్తంగా మారాయని, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టించుకోవాలని ఎంసిపిఐ(యు) పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పట్టణం లోని కాల్‌టెక్స్ సింగరేణి ఏరియా హాస్పిటల్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ప్రధాన రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే ఇదేతంతు కొనసాగుతుందని సంవత్సరకాలంలో మూడు నెలలు మాత్రమే రోడ్డు సక్రమం గా ఉంటుం దని తాత్కాలికంగా మట్టి పోసి నింపడమే తప్ప రోడ్డుకు శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు కింద పడిపోయి కాళ్లు చేతులు విరగొట్టుకునే పరిస్థితి ఏర్పడుతున్నాయని దీనివల్ల ఎంతోమంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వినోద్ స్పందించి కొత్త రోడ్డును వేయించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, మండల కార్యదర్శి ఆరేపల్లి సతీష్, తొగరి రాహుల పాల్గొన్నారు.

పరకాల పట్టణ అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

జనం పవర్, పరకాల, జూలై 29: పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. మంగళవారం పరకాల పట్టణ కేంద్రం లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో జేసీబీ, 6 స్వచ్ఛ ఆటోలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మహిళా సంఘాల ఉత్పత్తుల, అమ్మకాల సందర్శన స్టాల్‌ను పరిశీలించారు. అంతకుముందు వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం మున్సిపల్ కార్మిక సిబ్బందికి బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందాల్సిన పరకాల గత పాలకుల వైఖరి వల్ల నిరాదారణకు గురైందని ఆరోపించారు. పరకాల పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కృషి చేస్తున్నానన్నారు. పరకాలలో స్కిల్ డెవలప్‌మెట్ ఏర్పాటు చేయబోతున్నామని, త్వరలో సెట్విన్ రాబోతుందన్నారు. టీయూఎఫ్ ఐడీసీ నిధులతో డీపీఆర్ ద్వారా అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే నలభై కోట్లతో డ్రైనేజీ, దాదాపు 11 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేస్తున్నా మని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

ప్రజలు పరిశుభ్రత పాటించి పారి శుధ్య సమస్య పరిష్కరించడంలో భాగస్వాములు కావాలని కోరారు. పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రజలు సహకరించాలన్నారు. గత పాలకుల మోసపూరిత మాటలతో పరకాల పట్టణం వెనుకబడిందన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నివాస గృహాలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు సరఫరా, రైతు భరోసా, 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ, యువతకు రాజీవ్ యువ వికాసం, మహిళలకు వడ్డీ లేని రుణాలను, ఇతర సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తిరుమలకు వైభవంగా ప్రారంభమైన మహా పాదయాత్ర

జనం పవర్, పటాన్‌చెరు, జూలై 29: పటాన్‌చెరు పట్టణం నుంచి తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనార్థం 21వ మహాపాదయాత్రను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ పాదయాత్రను సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ప్రత్యేక అతిథిగా హాజరై, పాదయాత్రలో పాల్గొని భక్తుల మనోభావాలను అభినందించారు. సీసాల రాజు, ఆయన మిత్రబృందాన్ని నీలం మధు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి ఇప్పటివరకు 20 సార్లు పాదయాత్ర పూర్తి చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. నేడు 21వ సారి ఈ యాత్రను ప్రారంభించటం అనందదాయకమన్నారు. ఇది భక్తుల ఆధ్యాత్మిక సంకల్పానికి నిదర్శనమన్నారు. స్వామివారి కృపతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయ్యం

జనం పవర్, హనుమకొండ, జూలై 29: ఉద్యోగుల సంక్షేమం తన ధ్యేయమని ఆర్టిజన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ అన్నారు. హనుమకొండలోని వడ్డేపల్లి నందు పల్లా రాజేశ్వర్ రెడ్డి భవన్‌లో రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల రి.నె.327 సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ ఏ ఉద్యోగికి కష్టం వచ్చినా వారిని కంటికి రెప్పలా కాపాడు కుంటానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎండీ వరుణ్ కుమార్, రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేయాలి

జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు వాకిటి శ్రీధర్

జనం పవర్, వనపర్తి, జూలై 29: క్రీడాకారులకు పౌష్టిక ఆహారాన్ని అందజేయాలని, అప్పుడే వారు క్రీడల్లో రాణిస్తారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ అన్నారు. ఆగస్టు 3,4 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికను మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి క్రీడలకు పుట్టినిల్లు వంటిదన్నారు. ఆనాటి పీడీ నారాయణదాసు శిక్షణలో అనేక మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో క్రీడలకు ప్రాతినిధ్యం వహించి వనపర్తికి గొప్ప కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టారన్నారు. ఈ గొప్పతనం నారాయణదాసుకు చెందుతుందని కొనియాడారు. ఇప్పుడు కూడా అదే పరంపర కొనసాగాలని కోరారు. క్రీడలకు సంబంధించిన ఎలాంటి అవసరాలు, సౌకర్యాలను సమకూర్చడంలో తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. వెనకబడ్డ వనపర్తి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారుల దేహదారుద్యాన్ని సాధించడంలో తల్లిదండ్రులు కూడా కీలక పాత్ర ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించి గెలుపు, ఓటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ కోసం జిల్లా నలుమూలల నుంచి దాదాపుగా 300 మంది అథ్లెటిక్స్ పాల్గొన్నాంన్నారు. ఇంత పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొనడం సంతోషదాయకమన్నారు. క్రీడాకారులను వారి తల్లిదండ్రులను జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుధీర్ కుమార్ రెడ్డి, మోహన్‌లాల్. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్, పీడీలు మంజుల, రాధిక, సునీత,యువరాజు, బసవరాజు, మహేష్, శ్రావణ్, దామోదర్ స్వామి, రాజశేఖర్, నరేష్, రాజప్ప, నవీన్, తిరుపతి, జబ్బార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆడిటింగ్

జనం పవర్, పటాన్‌చెరు, జూలై 29: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఆడిటింగ్ పూర్తి చేసినట్లు జిన్నారం ఇంచార్జి ఎంఈఓ కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిన్నారంలో 43, గుమ్మడిదలలో 23 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు సంబంధించిన క్యాష్ బుక్‌లు, యూసీలు, ఇతర ఆర్థిక రికార్డులను సమర్పించారని తెలిపారు. ఆ రికార్డులను ఆడిటర్లు రమేష్, దిలీప్, ప్రశాంత్, భాషా విశ్లేషించి పూర్తి స్థాయిలో పరిశీలన జరిపినట్లు పేర్కొన్నారు. జిన్నారం ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ, గుమ్మడిదల కోఆర్డినేటర్ భీమ్, అలాగే పలు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు

బ్రహ్మంగారి మనుమడికి ఘన స్వాగతం

జనం పవర్, బెజ్జంకి, జూలై 29: కడప జిల్లా కందిమల్లారెడ్డి పీఠాధిపతి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఎనిమిదవ తరం ముదిమనవడు వెంకటాద్రికి విశ్వబ్రాహ్మణులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయానికి బ్రహ్మంగారి మనవడు వచ్చిన సందర్భంగా మండల విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు సతీ సమేతంగా వెంకటాద్రి కి పాదపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణుల సంఘం బెజ్జంకి మండల అధ్యక్షుడు సాన గౌండ నరసింహచారి, రామచంద్రం, జానకి రాములు, కుబేర్, సానగౌండ మధు, సానగౌండ శరత్, సాన గౌండ కనకచారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

- అర్హులు వినియోగించుకోవాలి - ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జనం పవర్, పటాన్‌చెరు, జూలై 29: రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2096 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ఈ పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

జనం పవర్, సంగెం, జూలై 29: సంగెం మండలంలోని కాపుల కనపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్, ఏఎన్ఎంతో పాటు విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో భాగంగా పీ హెచ్‌సిలో గడువు తీరిన మందులో ఉండటంపై సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సాంబశివ రావును ఆదేశాలు జారీ చేశారు.

విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కారదర్శి కిరణ్

జనం పవర్, వనపర్తి, జూలై 29: విద్యా రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కారదర్శి కిరణ్ ఆరోపించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యారంగ అభివృద్ధిని పూర్తిగా మరిచిపోయారన్నారు. గడచిన 18 నెలలో ఎక్కడ కూడా గురుకులాలకు, జూనియర్ కళాశాలలకు, సంక్షేమ హాస్టళ్ల వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయలేదన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరే విద్యా శాఖను పెట్టుకుని నిధులు కేటాయించకపోతే విద్యారంగాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని విమర్శించారు. రాష్ట్రంలో కొత్త యూనివర్సిటీల పేరుతో వందల కోట్లు తమ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం ఏర్పాటు చేయడం తప్ప ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వందల కోట్లు పెట్టి అందాల పోటీలను పెట్టిన ముఖ్యమంత్రి విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్ లేవనడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆసుపత్రులలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే కనీసం అనగారిన విద్యార్థులను పరామర్శించడానికి సీఎంకు సమయం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ సందర్శన వేళల్లో మార్పు

జనం పవర్, పెద్దపల్లి, జూలై 29: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సందర్శన వేళల్లో స్వల్ప మార్పు చేశారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు కార్యాలయ పని దినాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజలను ప్రత్యక్షంగా కలవనున్నారు. ప్రజలు తమ సమస్యలపై ఈ సమయంలో కలవాలని సూచించారు. ఇతర సమయాల్లో అత్యవసరాలైతే అదనపు కలెక్టర్‌ను సంప్రదించాలన్నారు. తనిఖీల నిమిత్తం ఈ మార్పు చేసినట్లు వివరించారు.

బొగ్గు రైలుపై తెగిపడిన హైటెన్షన్ వైరు

జనం పవర్, పెద్దపల్లి, జూలై 29: పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో పెను ప్రమాదం తప్పింది. 3వ ప్లాట్‌ఫారమ్ వద్ద హై టెన్షన్ విద్యుత్ వైరు తెగిపడి, ఆగి ఉన్న బొగ్గు రైలు బోగీపై పడింది. సకాలంలో ప్రమాదం గుర్తించడంతో ప్రయాణికులకు ఎలాంటి హాని జరగలేదు. ప్రమాద స్థలాన్ని వెంటనే ఖాళీ చేయించడంతో పెనుముప్పు తప్పింది. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన రైల్వే అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం కోసం అధికారులు విచారణ జరుపుతున్నారు.

ఆగి ఉన్న లారీనీ ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

జనం పవర్, హుజూరాబాద్, జూలై 29: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటన శంకరపట్నం మండలం తాడికల్‌లో జరిగింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన భాష బోయిన రాకేష్ వేములవాడ దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో రోడ్డు పక్కన నిలిచిన లారీని సోమవారం అర్ధరాత్రి ఢీ కొట్టాడు. ఆటోలో ప్రయాణిస్తున్న రాకేష్, రమణికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వారిని ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆగిన ఆర్ఓబి

- రూ.154 కోట్లు అందుబాటులో ఉన్నా వంతెన పనులు జరగడం లేదు
- కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు

జనం పవర్, కరీంనగర్, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ విషయంలో తీవ్ర జాప్యం చేయడంతోనే తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ముందుకు సాగడం లేదని బీజేపీ నేత, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. మంగళవారం బీజేపి శ్రేణులతో కలిసి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ భూసేకరణ సమస్యను వెంటనే పరిష్కరించి వంతెన పనులు కొనసాగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణలో జాప్యం చేస్తూ ఆర్ఓబి అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నదని ధ్వజమెత్తారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని సేతుబంధన్ ప్రాజెక్టులో భాగంగా తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు చేయించి రూ.154 కోట్ల నిధులు విడుదల చేసి పనులను ప్రారంభం చేయించారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఓబి నిర్మాణంలో కీలకమైన భూ సేకరణ విషయాన్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గతంలో 150 ఫీట్ల వెడల్పుతో ప్రతిపాదించిన ఆర్ఓబి సర్వీస్ రోడ్డును 125 ఫీట్లకు కుదించిన రాష్ట్ర ప్రభుత్వం దానికి సంబంధించి నివేదిక ఇవ్వకపోవడంతో భూసేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధులు విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ అంశాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. దీంతో నగర ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

గతంలో రెవెన్యూ శాఖ 150 ఫీట్లకు మార్కింగ్ చేసి రిపోర్ట్ తయారు చేసి నష్ట పరిహారం చెల్లించేందుకు సిద్ధం చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం దాన్ని 125 ఫీట్లకు కుదించిందని గుర్తు చేశారు. రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వే చేపట్టి ఎక్కడెక్కడైతే భవనాలు పోతున్నాయో వాటికి మార్కింగ్ చేయించి, తగిన నష్ట పరిహారం చెల్లించి కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని సునీల్ రావు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలోపార్టీ మాజీ కార్పొరేటర్లు గుగ్గిల్లపు రమేష్, కొలగాని శ్రీనివాస్, కాసర్ల ఆనంద్, చొప్పరి జయశ్రీ, అనూప్ కుమార్, లెక్కల స్వప్న వేణు, బీజేపీ నాయకులు గాయత్రి, చాడ ఆనంద్, లడ్డు ముందాడా, నాంపల్లి శ్రీనివాస్, ఆవుదుర్తి శ్రీనివాస్, బండారి అంజి, రాజు, కన్నం శ్రీనివాస్, రాజ్ ప్రభాకర్, రమేష్, నవీన్, కుమార్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కే గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో

కొండగట్టు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

జనం పవర్, మల్యాల, జూలై 29: జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిదానంలో ఎస్ఆర్‌కె సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఇప్పటి వరకు 62వ వారం భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ రోజు నుంచి కొండగట్టు ఆంజనేయ స్వామి భక్తుల కోసం ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్‌కె ప్రతినిధులు తెలిపారు.

ఇసుక రీచ్‌ల కేటాయింపు

జనం పవర్, కరీంనగర్, జూలై 29: వినియోగదారుల అవసరాల నిమిత్తం జిల్లాలోని 7 ఇసుక రీచ్‌ల నుంచి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణాకు అనుమతులను మంజూరు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో డిస్ట్రిక్ లెవెల్ సాండ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల అవసరాల కోసం ఊటూరు -2, ఊటూరు-1, చల్లూర్, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, కొండపాక పోతిరెడ్డిపల్లి రీచ్‌లను కేటాయించినట్లు పేర్కొన్నారు. చేగుర్తి ఇసుక రీచ్‌ను ప్రభుత్వ అవసరాలు, ఇందిరమ్మ నిర్మాణానికి అనుమతిస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా మల్యాల, పెగడపల్లి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అవసరాలకు రామడుగు మండలం మోతెలోని ఇసుక రీచ్ నుండి 15000 మెట్రిక్ టన్నుల ఇసుక తీసుకునేందుకు అనుమతించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, మైనింగ్‌శాఖ ఏడి రాఘవరెడ్డి, ఈఈలు బలరామయ్య, రవీంద్ర కిషన్, జిల్లా ఇరిగేషన్ అధికారి జగన్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జియాలాజిస్ట్ ప్రసన్న కరణం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనకు ఏఆర్ ఫౌండేషన్ కృషి..

- ఏఆర్ఎఫ్ వ్యవస్థాపకుడు సత్యనారాయణ

జనం పవర్, సిద్దిపేట (దుబ్బాక), జూలై 29: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అఖిల రాజ్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఏఆర్ఎఫ్ వ్యవస్థాప కులు, కూకట్పల్లి ఎస్ఐ తౌడ సత్యనారాయణ అన్నారు. మంగళవారం దుబ్బాక మండ లం పెద్ద చీకోడ్ గ్రామ యువతకి వాలీబాల్ స్పోర్ట్ కిట్ అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని యువత సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్‌లో భాగంగా ట్రాఫిక్ పోలీస్ డిపార్ట్మెంట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేయడానికి గ్రామ యువకులు తనను కలిసి రిక్వెస్ట్ చేయగా సానుకూలంగా స్పందిస్తూ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో అఖిల రాజ్ పౌండేషన్ సంస్థ ప్రతినిధి ఇనుప రవి, చీకోడ్ గ్రామ యువత పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగపంచమి వేడుకలు

జనం పవర్, హుజురాబాద్, జూలై 29: హుజురాబాద్ పట్టణంలోని కొత్తపల్లి నాగేంద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో నాగపంచమి వేడుకలు జరిగాయి. నాగ పంచమి సందర్భంగా దేవాలయానికి ఉదయం భక్తులు పోటెత్తారు. నాగేంద్ర స్వామి దేవాలయంలో తెల్లవారు జామున పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయంలో పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దపల్లి ఆది వరాహస్వామి ఆలయంలో..

పెద్దపల్లి: నాగుల పంచమి సందర్భంగా పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని స్వయంభుగా వెలసిన ఆది వరాహ స్వామి పుణ్యక్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని భారీగా వచ్చిన భక్తులు పాముల పుట్ట వద్ద పాలు, పానకం పోసి, అగరుబత్తులు వెలిగించి, హారతులు ఇచ్చారు. కొబ్బరికాయలు కొట్టి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆది వరాహ స్వామి దర్శనం చేసుకున్నారు.

సర్కారు దవాఖానలో అరుదైన ఆపరేషన్

- కడుపులో నుంచి 4 కిలోల గడ్డ తొలగింపు

జనం పవర్, సిద్దిపేట (దుబ్బాక), జూలై 29: దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతపల్లి గ్రామానికి చెందిన మంజుల గత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చారు. ఆమెకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో ఓవేరియన్ మాస్ గడ్డ ఉందని నిర్ధారణ చేసి ఆపరేషన్ నిర్వహించి

4.3 కిలోల గడ్డను తొలగించారు. ఈ కార్యక్రమంలో మత్తు డాక్టర్ రాఘవేందర్, ఆరోగ్యశ్రీ శ్రీహరి తోపాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు హెచ్‌టి సేవలు మరింత వేగవంతం

పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్

జనం పవర్, పెద్దపల్లి, జూలై 29: హెచ్‌టి (11 కె.వి, 33 కె.వి, అంత కంటే పై వోల్టేజీ) సేవల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సింగిల్ విండో వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతోందని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మరింత సులభతరం చేయడం కోసం హెచ్‌టి మానిటరింగ్ సెల్‌లను సర్కిల్ ఆఫీసులు, కార్పొరేట్ ఆఫీసుల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 11 కె.వి. దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్‌లోని ఏ.డి.ఈ (కమర్షియల్) అధికారి, 33 కె.వి. ఆపై వోల్టేజీ దరఖాస్తులను కార్పొరేట్ ఆఫీస్‌లోని ఏ.డి.ఈ (కమర్షియల్) అధికారి మానిటర్ చేస్తారని పేర్కొన్నారు. వినియోగదారులు ముందుగా టీజీఎన్ పిడిసిఎల్ పోర్టల్ ద్వారా అవసరమైన పత్రాలతో హెచ్‌టి దరఖాస్తు నమోదు చేస్తే, దానికి ప్రత్యేక యుఐడి నంబర్ వస్తుంది. ఈ దరఖాస్తులు తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత సర్కిళ్ల డాష్ బోర్డులలో కనపడతాయి. అధికారులు రోజూ ఈ డాష్ బోర్డులను పరిశీలిస్తూ, తదనుగుణంగా తదుపరి చర్యలు చేపడతారని ఆయన వివరించారు. 11 కె.వి. దరఖాస్తులకు సంబంధిత ఎస్టిమేట్లు సర్కిల్ ఆఫీసు ద్వారా, 33 కె.వి. లేదా పై వోల్టేజీ సేవలకు అవసరమైన ఎస్టిమేట్లు కార్పొరేట్ ఆఫీసు ద్వారా మంజూరు చేయబడతాయని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్ తెలిపారు.

వావిలాల జెడ్‌పిహెచ్‌ఎస్‌లో సైకిళ్ల పంపిణీ

జనం పవర్, జమ్మికుంట, జూలై 29: వావిలాల జెడ్‌పిహెచ్‌ఎస్‌లో మంగళవారం విద్యార్థులకు మోడీ కానుకగా సైకిళ్లను బీజేపీ జమ్మికుంట మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు, మండల ప్రధాన కార్యదర్శి పుల్లూరి ఈశ్వర్‌లు పంపిణీ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ మోడీ కానుకగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పుట్టిన రోజు సం దర్భంగా సైకిళ్ల పంపణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వారు తెలిపారు. నాయకులు సమావేశంలో మాట్లాడుతూ పాఠశాలల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 20వేల సైకిళ్ల పంపిణీకి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారని, ఇతర తరగతి విద్యార్థులకు మోదీ కిట్స్ పేరుతో బ్యాగ్, వాటర్ బాటిల్, పుస్తకాలు అందివ్వాలని నిర్ణయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరగోని రాజన్న, మేడిపల్లి సమ్మయ్య, కొండ హరీష్, రాగల మహేష్, బాసాని సత్యం, తుడి గణేష్, రుద్రవరం శివానంద చారి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: వొడితల ప్రణవ్



జనం పవర్, హుజురాబాద్, జూలై 29: పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలై ఇబ్బందులు పడ్డ లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలు, 2 పట్టణాలు కలిపి 147 మంది లబ్ధిదారులకు రూ.51,14,000ల విలువ చేసే చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెక్కులు అందుకున్న వారు త్వరగా బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని, చెక్కుల పంపిణీ చేయడంలో అలసత్వం వహిస్తున్న కౌశిక్ రెడ్డి తన విధానం మార్చుకోవాలని సూచించారు. ప్రోటోకాల్ అని రెచ్చిపోయే కౌశిక్ రెడ్డి, చెక్కులు ఇచ్చే క్రమంలో సీఎం ఫోటో కట్ చేసి ఇవ్వడం ప్రోటోకాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పథకాలే రాబోయే స్థానిక పోరులో మమ్మల్ని గెలిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు, మార్కెట్ చైర్మెన్‌లు, డైరెక్టర్లు, దేవస్థాన చైర్మెన్‌లు సీనియర్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలి

జనం పవర్, వనపర్తి, జూలై 29: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాటం కమిటీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సమస్యలతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ పిఆర్సీని, ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని వారు కోరారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. రెండవ దశ కార్యక్రమం ఆగస్టు 1న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌పిసి నాయకులు ఎస్.రవి ప్రసాద్‌గౌడ్, కే.యేసోఫ్, డి.కృష్ణయ్య, బి.శ్రీనివాసులు, శివారెడ్డి, కొంకల వెంకట్ నారాయణ, సి. మద్దిలేటి, చిన్న రాములు, బి. వెంకటేష్, పి.శ్రీనువాస్ గౌడ్,యం.డి.హామీద్, శ్రీనివాస్ గౌడ్,చంద్రశేఖర్,జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోష్ మీదున్న పవన్ కల్యాణ్.. 'ఉస్తాద్ భగత్‌సింగ్' క్లైమాక్స్ పూర్తి



పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. పవన్ కల్యాణ్ - హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ తాజాగా షేర్ చేసింది. దీని క్లైమాక్స్ పూర్తయినట్లు తెలిపింది. పవన్ కల్యాణ్ ఎంతో అంకితభావంతో దీని షూటింగ్‌లో పాల్గొన్నారంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. ''ఎన్నో భావోద్వేగాలతో కూడిన ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ పూర్తయింది. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా క్యాబినెట్ సమావేశాలు, బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు 'హరి హర వీరమల్లు' ప్రచారంలో పవన్ కల్యాణ్ భాగమయ్యారు. అదే మెరుపు వేగంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ఇది ఆయన అంకితభావానికి, కష్టపడి పనిచేసే స్వభావానికి నిదర్శనం'' అని నిర్మాణ సంస్థ తెలిపింది . ఈ విషయాన్ని తెలుపుతూ సెట్‌లో పవన్, హరీశ్ శంకర్‌ల ఫొటోను పంచుకుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న చిత్రం కావడంతో దీనిపై సినీప్రియులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, స్పెషల్ వీడియోలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఇక పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.

బలంగా ఉండటం అంటే ఇదే.. సమంత వీడియో వైరల్

అగ్ర కథానాయిక సమంత ఫిట్‌నెస్‌కు ఎంత ప్రాధాన్యం ఇస్తారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. జిమ్‌లో సామ్ 100 కిలోలు ఎత్తిన వీడియోలు ఎన్నో ఉన్నాయి. ఆమెను చూసి ఫాలోవర్స్ కూడా స్ఫూర్తి పొందుతుంటారు. తాజాగా ఈ బ్యూటీ డెడ్‌హ్యాంగ్ ఛాలెంజ్‌ను తీసుకున్నారు. 90 సెకన్ల పాటు ఈ వ్యాయామం చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ట్రైనర్ పంచుకున్నారు. 'టేక్20హెల్త్' అనే పాడ్‌కాస్ట్ సిరీస్‌లో సమంత ఎప్పుడూ తన ఫిట్‌నెస్, ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను పంచుకుంటుంటారు. తాజాగా ఓ ట్రైనర్ సమంత స్వీకరించిన ఛాలెంజ్ గురించి వివరిస్తూ వీడియోను పంచుకున్నారు. ''మీరు ఎలా కనిపిస్తున్నారు అనేది విషయం కాదు. మీ వారసత్వం ఏమిటనేది కూడా ముఖ్యం కాదు. సెల్ఫీలు పంచుకోవడం కూడా ప్రాధాన్యం కాదు.. ఎవరూ చూడనప్పుడు మీరు ఎంత బలంగా ఉన్నారనేది ముఖ్యం'' అని ఈ వీడియోకు ఆయన క్యాప్షన్ పెట్టారు. ఇది చూసిన వారంతా సామ్ సో స్ట్రాంగ్ అని కామెంట్స్ చేస్తున్నారు.

చదరంగంలో రా'రాణి'

కోనేరు హంపి గ్రాండ్‌మాస్టర్ అయిన మూడేళ్లకు పుట్టిన అమ్మాయి దివ్య దేశ్‌ముఖ్. అపార అనుభవం, లెక్కకు మిక్కిలి టైటిళ్లు, గత ఏడాదే ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో విజయం.. ఇలా హంపి బలాన్ని చాటే ఘనతలు ఎన్నెన్నో. దివ్య చూస్తే ఇంకా గ్రాండ్‌మాస్టర్ కూడా కాలేదు. ప్రపంచ వేదికల్లో ఆమె సాధించిన పెద్ద ఘనతలేమీ లేవు. ఇలాంటి ఇద్దరి మధ్య పోరు అంటే మొగ్గు హంపికే అనుకుంటారంతా! కానీ ప్రతిష్ఠాత్మక మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్లో అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ, అద్భుత ప్రదర్శనతో తెలుగమ్మాయికి షాకిచ్చింది మహారాష్ట్ర యువ తార. టోర్నీ ఆరంభం నుంచి అసాధారణంగా ఆడుతూ హేమాహేమీలను వెనక్కి నెట్టి ఫైనల్ చేరిన దివ్య.. తుది పోరులోనూ తన ప్రతిభను చాటింది. హంపికి దీటుగా నిలుస్తూ, రెండు క్లాసికల్ గేమ్‌లను డ్రా చేసుకున్న దివ్య.. సోమవారం టైబ్రేక్‌లో 1.5-0.5తో పైచేయి సాధించి ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయింది.

ఆసియా కప్‌లో భారత్- పాకిస్థాన్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం లేదు!

ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న గ్రూప్ దశలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ జరగనుంది. అయితే ఈ షెడ్యూలు విడుదలైన తర్వాత నుంచి సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం, పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో టీమ్‌ఇండియా.. ఆ దేశంతో క్రికెట్ మ్యాచ్ ఆడకూడదంటూ పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. అయితే ఈ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఆసియా కప్‌లో మొత్తంగా టీమ్‌ఇండియా గరిష్ఠంగా మూడుసార్లు పాకిస్థాన్‌తో తలపడే అవకాశం ఉంది. 'ఇది ద్వైపాక్షిక పోటీ కాదు. బహుళ దేశాలు పాల్గొనే టోర్నమెంట్లో జరిగే మ్యాచ్. పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడకుంటే.. దాయాది జట్టుకు భారీ ప్రయోజనం కలుగుతుంది. కాబట్టి అది సరికాదు' అని అధికారిక వర్గాలు అంటున్నాయి. అలాగే ఈవిషయమై క్రీడా మంత్రిత్వశాఖ అధికారులు కూడా మాట్లాడారు. 'ప్రస్తుతానికి, జాతీయ క్రీడా పాలన బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. కాబట్టి.. బీసీసీఐ క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాదు. అయితే బీసీసీఐ ప్రజల మనోభావాల మీద ఎలా స్పందిస్తుందో వేచి చూద్దాం' అని వారు అన్నారు. అయితే పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలకు మాత్రం తావులేదని క్రీడా మంత్రిత్వ శాఖ పేర్కొంది. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) కేజీఎస్ ధిల్లాన్, పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా బహిష్కరించాలని పిలుపునిచ్చిన ప్రముఖులలో ఒకరు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, క్రీడలు కొనసాగాలని పేర్కొన్నారు. అయితే, ఎనిమిది దేశాల జట్లు పాల్గొనే ఆసియా కప్ ఐసీసీ ఈవెంట్ కాదు. అలాగే.. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోహ్సిన్ నఖ్వీనే ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. 2008 ముంబయి ఉగ్రదాడుల వెనక పాకిస్థాన్ హస్తం ఉన్న నేపథ్యంలో.. అప్పటినుంచి భారత్ ఆ దేశంతో ద్వైపాక్షిక సిరీస్‌ల్లో పాల్గొనడం లేదు. కానీ వరల్డ్‌కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ ఈవెంట్లలో ఇరు దేశాల జట్లు తటస్థ వేదికల మీదే తలపడుతున్నాయి.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL **TEL/2016/69862**, EDITOR:BANDARI MARUTHI.

మొక్కలు నాటడంలో సింగరేణి ముందంజ

చెట్ల పెంపకం ద్వారానే స్వచ్ఛమైన ఆక్సిజన్
సింగరేణి సీఎండీ బలరాం

జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29: మొక్కలు నాటడంలో సింగరేణి ఎల్లప్పుడూ ముందుంటుందని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. సింగరేణివ్యాప్తంగా తలపెట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని జికేఓసిలో గల డంప్‌యార్డ్‌పై వనమహోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థ మొక్కలు నాటడంలో ముందు వరుసలో ఉంటుందని బొగ్గు ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ తప్పక మొక్కలు చెట్లను నాటాలని అలాగే చుట్టుపక్కల ప్రభావిత ప్రాంతాల వారికి కూడా మొక్కలను నాటి వాటిని పరిరక్షించేలా ప్రోత్సహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తాను స్వయంగా ఇప్పటివరకు 19,775 మొక్కలను నాటడం జరిగిందని తాజాగా 225 మొక్కలను నాటి మొత్తంగా 20,000 మొక్కలు నాటినట్లుగా చెప్పారు. ప్రతి ఉద్యోగి మొక్కను నాటడం బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం వలన వాతావరణ సమతుల్యమై ప్రకృతి విపత్తులు సంభవించకుండా ఉంటాయని తెలియజేశారు. కొత్తగూడెం ఏరియా జిఎం శాలెం రాజు మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన 85 హెక్టార్లలో 3.5లక్షల మొక్కలు నాటడానికి ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. చైర్మన్ ఒక్కరే 20 వేల మొక్కలు నాటి మన అందరికీ ఆదర్శంగా ఉన్నారని కొత్తగూడెం జీకే ఓసీ డంప్‌పై 225 మొక్కలు నాటడం ద్వారా ఈ రికార్డు సొంతం అయిందని ఆ రికార్డును మన కొత్తగూడెం ఏరియాలో నెలకొల్పడం ఎంతో గర్వించదగిన విషయమని అన్నారు. చైర్మన్ మొక్కల నాటే బృహత్తర కృషికి గుర్తింపుగా విశ్వగురు వారు వరల్డ్ రికార్డులో చోటు ఇవ్వడం జరిగిందన్నారు. ఆరేళ్లలో సింగరేణిలో 35కు పైగా చిట్టడవులను సృష్టించి దేశంలో 20వేల మొక్కలను నాటిన మొదటి సివిల్ సర్వీసెస్ అధికారిగా రికార్డు నెలకొల్పడం జరిగిందని అన్నారు. ఇందు నిమిత్తం సర్టిఫికేట్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ తో విశ్వ గురు సంస్థ వారు చైర్మన్ ని సన్మానించినట్లుగా చెప్పారు. అనంతరం జిఎం (సిడిఎన్)ఎస్.డి ఎం. సుభాని మాట్లాడుతూ చైర్మన్ ఆరేళ్లలో సింగరేణి ఏరియాల నందు నాటిన ప్లాంటేషన్ లపై దృశ్యరూపకమున పుస్తకమును రూపొందించి ఆ పుస్తక ఆవిష్కరణను చైర్మన్‌తో చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమానికి ముందుగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు చైర్మన్ కు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలికారు. వన మహోత్సవ కార్యక్రమానికి హాజరైన వ్యక్తులు చైర్మన్ బలరాంకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు, డైరెక్టర్(ఆపరేషన్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు, డైరెక్టర్(పా)గౌతమ్ పొట్రు, కొత్తగూడెం ఏరియా జిఎం ఎం షాలెం రాజు, డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ కృష్ణగౌడ్, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ కోటేశ్వరరావు, జిఎం(సిడిఎన్)ఎస్.డి ఎం.సుభాని, సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ కిరణ్ కుమార్, కొత్తగూడం ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు ఎంవి.నరసింహారావు, ఏజిఎం (సివిల్)సిహెచ్.రామకృష్ణ, డిజిఎం(పర్సనల్) జి.వి.మోహన్ రావు, డిజిఎం(ఐఈడి) ఎన్.యోహన్, ఎస్ఓఎం ఎన్విరాన్మెంట్ టి.సత్యనారాయణ, ఫారెస్ట్ మేనేజర్ హరినారాయణ, జికేఓసి మేనేజర్ రామచంద్ర మురళి, ఐటి మేనేజర్ శేషశ్రీ, ఇతర విభాగాల అధిపతులు, అధికారులు జికేఓసి ఓసి అధికారులు, ఇతర నాయకులు , సూపర్వైసర్లు, ఉద్యోగులు, ఎస్ఎన్‌పిసి సిబ్బంది డిఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును పరిశీలించిన నిర్మల్ ఎస్పీ



జనం పవర్, బైంసా, జూలై 29: ఎడతెరిపిలేని వర్షాల నేపథ్యంలో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల గారు కడం ప్రాజెక్టుకు లోతట్టు ప్రాంతాన్ని మంగళవారం సాయంత్రం పరిశీలించారు. వరద ప్రవాహం పెరుగుతున్నందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఈ వరుసల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటద్దని, జలశయాల వద్ద వెళ్లొద్దని ప్రజలకు ఎస్పి సూచించారు. ఏ సమయంలోనైనా అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ హెల్ప్ డెక్స్ 8712659555, 100 ను ఫోన్ చేయాలన్నారు.

దళారులను ఆశ్రయించవద్దు

సమస్యలుంటే సంప్రదించండి

ప్రజావాణిలో వచ్చిన ఆరోపణలపై తహసీల్దార్ అనుపమారావు వివరణ

జనం పవర్, గంగాధర జూలై 29: కరీంనగర్ జిల్లా గంగాధర మండల తహసీల్దార్ అనుపమారావు సోమవారం మండలానికి చెందిన కొంతమంది రైతులు ప్రజావాణిలో తనపై చేసిన ఆరోపణలపై స్పందిస్తూ స్పష్టతనిచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ, గట్టుబూత్కూర్ గ్రామానికి చెందిన ఒంటెల భాస్కర్ రెడ్డి 38/2021 ద్వారా ఒంటెల గౌతమికి విక్రయ దస్తావేజు చేసినట్టు, ఆ తర్వాత మళ్లీ వచ్చి అదే భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయవద్దని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అయితే, భాస్కర్ రెడ్డి ఇప్పటికే గౌతమికి భూమిని రిజిస్ట్రేషన్ చేసినందున ఆ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. అలాగే, గౌతమి విక్రయ దస్తావేజు సంఖ్య 193/2025 ద్వారా అమిత్ కుమార్‌కి భూమి రిజిస్ట్రేషన్ చేసిన విషయాన్ని స్పష్టం చేశారు. అదే గ్రామానికి చెందిన అమడగోని ఎల్లమ్మ పెట్టుకున్న విరసత్ ఫిర్యాదు సరైన పద్ధతిలో పెట్టుకోకపోవడం, అలాగే సంబంధిత భూమికి సంబంధించిన పాస్ పుస్తకం కార్యాలయంలో లేకపోవడం వల్ల ఆమె అప్లికేషన్‌ను తిరస్కరించాల్సి వచ్చిందని వివరించారు. మండలంలో గల భూ దళారులను, పైరవీదారులను రైతులు సంప్రదించవల్సిన అవసరం లేదని, తాను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా రైతులు నేరుగా తనను కలవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులకు తమ కార్యాలయంలోని సిబ్బంది సకాలంలో సేవలు అందించకపోయినా, వారికి దురుసుగా ప్రవర్తించినా, లేదా డబ్బులు ఆశించినా, అటువంటి ఘటనలు జరిగితే నేరుగా తన వద్ద ఫిర్యాదు చేయాలని కోరారు. అటువంటి ఫిర్యాదులు వస్తే తక్షణమే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

జనం పవర్, లక్షెట్టిపేట, జూలై 29: మహాత్మా జ్యోతిబాపూలే (పురుషుల) డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరంలో ప్రవేశానికిగాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీఓ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనందున ఇంటర్మీడియట్ మార్కులను బట్టి అర్హత గల విద్యార్థులు ఆగస్టు 6వ తేదీ వరకు అప్లై చేసుకోవాలని సూచించారు. వివిధ కోర్సులలో ఉన్న ఖాళీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉచిత భోజనం, హాస్టల్ వసతితోపాటు యూనిఫామ్, టెక్స్ బుక్, నోట్ బుక్స్, ట్రాక్ షర్ట్, బెడ్ షీట్స్ అందజేస్తామని తెలిపారు. అలాగే ఆధునాతన సౌకర్యాలతో తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం కలదని తెలిపారు. మరింత సమాచారం కోసం 9603705803, 9137381807 నంబర్‌లకు కాల్ చేయవచ్చని తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

జనం పవర్, మంచిర్యాల, జూలై 29: బురద గూడెం గ్రామానికి చెందిన కామెర్ల లింగన్న మంగళవారం మధ్యాహ్నం మంచిర్యాల నుండి మందమరికి ప్రయాణించే క్రమంలో తన స్మార్ట్ ఫోన్ను ఆటోలో మర్చిపోయి దిగి వెళ్ళిపోయాడు. ఆటోలో మరిచిపోయిన ఆ ఫోన్‌కు వచ్చిన ఇన్కమింగ్ కాల కు స్పందించి ఆ వ్యక్తి ద్వారా కామర్ల లింగన్నకు సమాచారం అందించాడు. ఫోన్ యజమాని వచ్చేవరకు మందమరి టోల్ ప్లాజా వద్ద వేచి ఉండి అతని స్మార్ట్‌ఫోన్ అతనికి అప్పగించారు. ఫోన్ తీసుకున్న ప్రయాణికుడు ఆటో డ్రైవర్ మొహమ్మద్ హబీబ్ పాషా కు కృతజ్ఞతలు తెలుపగా, నిజాయితీ చాటుకున్న అతన్ని పలువురు అభినందించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

జనం పవర్, బైంసా, జూలై 29: ప్రభుత్వ నుండి వచ్చే పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలసి ఆయన మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 655 మంది లబ్ధిదారులకు మంగళవారర్ కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పతి సంక్షేమ పథకానికి రేషన్ కార్డు తప్పనిసరి అవసరం ఉంటుందని, ఇంకా రేషన్ కార్డులు లేని ప్రతి ఒక్కరు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సన్న బియ్యంతో ప్రతి ఒక్క బీదవాడు కడుపునిండా తిని ఆస్వాదిస్తున్నాడనీ ఎమ్మెల్యే అన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి

కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

జనం పవర్, బైంసా, జూలై 29: నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి వెల్లడించారు. ముధోల్ మండలంలోని బ్రహ్మణ్ గాం గ్రామానికి చెందిన సాయన్న కు కొద్ది రోజుల నుండి ఆరోగ్యం బాగోలేక నిమ్స్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన దేగంలోని తన నివాసంలో రూ.75,000 ఎల్ఓసి కాఫీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ ఓ సి ద్వారా బాధ్యత కుటుంబాలకు అందుతూనే ఉంటాయన్నారు. ఎవరికి సమస్య ఉన్న సంప్రదించాలని అన్నారు.

సేవకు నిదర్శనం సాబీర్ పాషా

సిపిఐ జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఎన్నిక కావడం అభినందనీయం
ఆయన భవిష్యత్తులో మరిన్ని పదవులను అలంకరించాలి
అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మద్దెల శివకుమార్

జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29: అందరివాడు సాబీర్ పాషా దమ్మున్న నాయకుడని ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఎన్నిక కావడం అభినందనీయమని భవిష్యత్తులో సాబీర్ పాషా మరిన్ని పదవులను అలంకరించాలని అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఆకాంక్షించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో పలువురు ఇటీవల మూడోసారి హ్యాట్రిక్ వీరుడుగా సిపిఐ జిల్లా సెక్రటరీగా ఎన్నికైన అభిమాన పాత్రుడు ఎస్ కే సాబీర్ పాషాకి పూల దండలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ సన్మానం అంటే అభిమానమని అభిమానాన్ని ఎప్పుడూ కూడా తృణీకరించవద్దని సాబీర్ పాషా భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లుగా పేర్కొన్నారు. సాబీర్ పాషా కమ్యూనిస్టు పోరాటయోధుడు నిరంతర సేవా తత్పరుడని కొనియాడారు. పురిటి నొప్పులతోనే పోరాటాలను ఉగ్గుపాలతోనే ఉద్యమాలను తప్పటడుగులతోనే త్యాగాలను ఆస్వాదించి అవపాసనం పట్టి వాటన్నిటినీ మేలవించి విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు పార్టీలో నాయకుడిగా ఎదిగిన వ్యక్తి సాబీర్ పాషా అన్నారు. పీడిత తాడిత ప్రజల కార్మిక కర్షకుల బడుగు బలహీన వర్గాల సమస్యలను భుజాన వేసుకొని అలుపెరుగని కార్మికుడిగా సుఖమెరుగని శ్రామికుడిగా 24 గంటల సర్వీస్ చేస్తూ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకి అన్ని విషయాలలో కుడి భుజంగా వ్యవహరిస్తూ అటు రాష్ట్ర పార్టీ సెక్రటరీగా ఇటు ఎమ్మెల్యే సేవలో ముందుండడం అభినందనీయమన్నారు. అనంతరం సన్మాన గ్రహీత ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ అన్ని రంగాలలో ఆరితేరిన మహా వ్యక్తి ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తనకు గత 40 సంవత్సరాలుగా అత్యంత సన్నిహితుడని వారి అభిమానం ఈ సన్మానం తన గురుతర బాధ్యతను ఇంకా పెంచిందని తప్పనిసరిగా వారి ఆకాంక్ష మేరకు అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తూ భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనలో ముందుకు నడుస్తామని కృతజ్ఞతలు తెలుపుతూ పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సత్కార అభినందన కార్యక్రమంలో ఎస్ కే సాబీర్ పాషా, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతో పాటు అపరబాలు అల్లి శంకర్, ఆదివాసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసం రామకృష్ణ, భారతరత్న అంబెద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పరి నవతన్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు దుంపల సుధాకర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మద్దెల ఆదర్శ్ డేవిడ్, చింటూ ఎఫ్రాయిమ్, సుమన్, కేదాసి కిరణ్, పాల్ సుహాస్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే నో పార్కింగ్ !

జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్టిసి బస్టాండ్ లోకి ప్రైవేట్ వాహనాలకు అనుమతి లేదని పేర్కొంటూ ఆర్టిసి యాజమాన్యం అక్కడక్కడ నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేసింది. అయితే "నో పార్కింగ్" బోర్డులు పేరుకే ఉన్నట్లుగా కనిపిస్తుందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఆటోలు కార్లు ద్విచక్ర వాహనాలను ఆర్టిసి ప్రాంగణంలోకి తీసుకువచ్చి ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో పాటు ఆర్టీసీ అద్దె బస్సులు నిలుపుదలకు స్థలం లేకుండా పోయింది. నో పార్కింగ్ బోర్డులతో సమస్య పరిష్కారం కాకపోగా మరింత ఎక్కువ అవుతుందని ప్రజలు మండిపడుతున్నారు. ప్రధానంగా బస్టాండ్ కాంప్లెక్స్ లో ఉన్న ఒక హొటల్ లో టిఫిన్ భోజనం కాఫీలు సేవించేందుకు వచ్చేవారి వాహనాలు అధికంగా ఉన్నాయని ప్రయాణికులతో వచ్చే సహాయకులు ఆరోపిస్తున్నారు. ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీ గార్డును పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తే ప్రైవేట్ వాహనాలు లోపలకి వచ్చే అవకాశం ఉండదని ఆ దిశగా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జనం పవర్. గోదావరిఖని, జూలై 29: రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. శిధిలావస్థలో ఉన్న భవనాలు వెంటనే ఖాళీ చేయాలని, పరిసరాలలో ఎవరూ సంచరించరాదని హెచ్చరిక నోటీసులు అంటించారు. టెయిల్ ఎండ్ ప్రాంతాల్లో నల్లా నీటికి క్లోరిన్ పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి గాంధీ నగర్ లోని కమ్యూనిటి టాయిలెట్స్ లో వసతులు పరిశీలించారు. ఆవరణ అంతా పరిశుభ్రం చేయించారు. చైతన్య పురికాలనీలో ముళ్ళ పొదలు తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై, తడి చెత్త, పొడిచెత్త వేరు చేయడం, దోమల నిర్మూలన, కుక్కకాటు బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే కళాజాతాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్, నాగభూషణం, మెప్మా సి ఓ ప్రియదర్శిని, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, వార్డ్ అధికారులు, సానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పిలు, స్వశక్తి మహిళలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఇంటర్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

జనం పవర్, పెద్దపల్లి, జూలై 29: జూలై 30, 31 తేదీల్లో జిల్లాలోని 8 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నాయి. వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు సంబంధిత పాఠశాలలకు నేరుగా వెళ్లి ప్రవేశం పొందవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి పేర్కొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో

నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

జనం పవర్, జగిత్యాల, జూలై 29: మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదువేల రూపాయల జరిమానా విధించారని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికను సంపంగి మహేష్ అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని, మాయ మాటలు చెప్పి అత్యాచారం చేశాడు. ఈ ఘటనలో నిందితుడిపై ఫోక్సో చట్టం ప్రకారం-2022లో కేసు నమోదు చే శామన్నారు. కేసును దర్యాప్తు చేసిన ఇన్స్పెక్టర్ కోటేశ్వర్, ఎస్ఐ కిరణ్ కుమార్‌లు కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డ్యూటీ అధికారులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వపరాలను విచారించిన న్యాయమూర్తి నారాయణ మంగళవారం నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడుటకు కృషి చేసిన పీపీ మల్లేశంగౌడ్, ఇన్స్పెక్టర్ కోటేశ్వర్,ఎస్ఐ కిరణ్‌కుమార్, సిఎమ్ ఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు శ్రీధర్, రాజులను ఎస్పీ అభినందించారు.

సైకిల్ యాత్ర విజయవంతం చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్

జనం పవర్, మిర్యాలగూడ, జూలై 29: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంఘర్షణ సైకిల్ యాత్ర పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నేటినుంచి ఆగస్టు ఆరో తేది వరకు జరిగే ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ సంక్షేమ హాస్టల్లో సంరక్షణకై సంఘర్షణ సైకిల్ యాత్ర విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలో రాక ముందు సంక్షేమ రంగాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని వాగ్దానం ఇచ్చి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఈ యాత్ర నల్లగొండలో ప్రారంభమై ఆరో తేదిన మిర్యాలగూడలో ముగింపు సభ ఏర్పాటు చేస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా విద్యారంగలో ఉన్న సమస్యలను అధ్యయనం చేసి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఎస్ఎఫ్ఐ పోరుబాటను సాగిస్తుందన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జరిగే సైకిల్ యాత్ర 33 మండలాలు ఆరు నియోజక వర్గాలు యాత్ర కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నల్గొండ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదా నాయక్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు న్యూమాన్, ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు అనిల్ ,డివిజన్ నాయకులు అజయ్‌తరుణ్ కల్యాణ్, కవిత, ప్రసన్న, నాగపుష్ప తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి నరేంద్ర మోడీ కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

జనం పవర్, బెజ్జంకి, జూలై 29: బీసీల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని బీజేపీ ఉమ్మడికరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జంకిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అభ్యర్థులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి,మండల సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డి, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి,రంగు భాస్కరాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్రెడ్డి,ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడిచర్ల రాజు,రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, బోయినిపల్లి అనిల్ రావ్,గైని రాజు, కొత్తపేట రామచంద్రం,దొమ్మాటి రాములు, సంగ రవి,సాన వేణు, దారం సతీష్ రెడ్డి,బుర్ర కిషన్,బండిపెల్లి శ్రీనివాస్,ఒగ్గు కనకయ్య,గాండ్ల శీను,బుర్ర క్రాంతికుమార్, కందిరాజులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేస్తాం

కార్మిక శాఖ మంత్రి వివేక్

జనం పవర్, సిద్దిపేట, జూలై 29: ఎన్ని ఇబ్బందులున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మంగళవారం మంత్రి సిద్దిపేట పట్టణంలోని కొండా మల్లయ్య గార్డెన్స్‌లో సిద్దిపేట అర్బన్ మండలం, సిద్దిపేట రూరల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులకోసం ప్రజలు ఎదురు చూశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకు ఎలా సేవచ్చేయాలనే అలోచించి ప్రజా ఉపయోగ కార్యక్రమాలను ప్రవేశపె ట్టామన్నారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ఎస్సి ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, జిల్లా ఇంచార్జి కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజేష్ చంద్ర, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగర్వాల్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, డిఎం సివిల్ సప్లై ప్రవీణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులు మూడు రోజుల్లో దరఖాస్తు చేయాలి

జనం పవర్, వనపర్తి, జూలై 29: గద్వాల, వనపర్తి జిల్లాల్లోని భవన, ఇతర నిర్మాణ కార్మికులు పెళ్లికానుక, ప్రసూతి సమయం, సాధారణ మరణం, ప్రమాద మరణం, డిసేబులిటీ సాయం కోసం సంబంధిత పత్రాలను మూడు రోజుల తమ కార్యాలయంలో సమర్పించాలని సహాయ కార్మిక అధికారికి తెలిపారు. గతంలో మంజూరై బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ కానీ కార్మికులు మూడు రోజులలోపు క్లైమ్‌కు సంబంధించిన నకలు కాపీ, బ్యాంక్ స్టేట్‌మెంట్ సమర్పించాలని సూచించారు. మూడు రోజుల తర్వాత ఈ సదుపాయం నిలుపుదల చేయబడుతుందని, దరఖాస్తులు స్వీకరించబడవని చెప్పారు.

దరఖాస్తులకు గడువు పొడిగించాలి..

భవన నిర్మాణ కార్మికులు మరణ, ప్రసవ, వివాహ ఆర్థిక సాయం కోసం మూడు రోజుల గడువు సరిపోదని కార్మికలు వాపోతున్నారు. చాలా మంది కార్మికులు హైదరాబాద్, పాలమూరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వారి జిల్లా కేంద్రంలోని బ్యాంకుకు వెళ్లి స్టేట్మెంట్ తీసుకొని భవన నిర్మాణ శాఖ కార్యాలయంలో సమర్పించాలి. కావున అధికారులు ఇచ్చిన మూడు రోజుల గడువును సరిపోదు. కావున మరో నెల రోజులు పొడిగించాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి తక్షణమే సమయం పెంచాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

జనం పవర్, సిద్ధిపేట (దుబ్బాక), జూలై 29: దుబ్బాకతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు దుబ్బాకలోని గాంధీ విగ్రహం వద్ద పుట్టకు పాలు పోశారు. అంతేకాకుండా స్థానిక ఎల్లమ్మ ఆలయంలో ఉన్న పుట్టకు పాలు పోసి, కొబ్బరికాయలు కొట్టి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. నాగుల పంచమి సందర్భంగా పట్టణంలోని ప్రధాన దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

- వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

జనం పవర్, వరంగల్ జిల్లా, జూలై 29: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వీహెచ్‌పీస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బాబు రాజు యాదవ్ అధ్యక్షత వహించిన సమావేశంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. దివ్యాంగుల ఆరు వేలు,వృద్ధులు, వితంతువుల పెన్షన్ నాలుగు వేలు, కండరాల క్షీనత రోగులకు, ఇతర తీవ్రమైన రోగులకు పదిహేను వేలు పెంచాలన్నారు. ఆగస్టు మొదటి వారంలోపు 15 డిమాండ్లు తీర్చక పోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, 13న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో లక్షలాది మందితో జరిగే మహాగర్జన మహాసభ తో కుప్ప కూల్చు తామని హెచ్చరించారు. ఎమ్మెస్పి జాతీయ నాయకులు వరంగల్ జిల్లా ఇన్చార్జి వంగూరి రావు మాదిగ, ఎమ్మెస్పి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కళ్లేపెల్లి ప్రణయ్ దీప్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సింగిల్ విండో చైర్మన్

జనం పవర్, వనపర్తి, జూలై 29: వనపర్తి మండలం రాజనగరం సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు మంగళవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాజనగరం సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్ రెడ్డి,పిఐసి డైరెక్టర్లు బాల చంద్రయ్య,సుదర్శన్ రెడ్డి, సంజీవ్ సాగర్, శివశంకర్ రెడ్డి, ఆంజనేయులు, సత్య నారాయణ రెడ్డి, జయరాం, సురేష్, కార్యాలయ సీఈవో మహేందర్ సిబ్బంది రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లో

రెండో విడత అడ్మిషన్లు

జనం పవర్, వనపర్తి, జూలై 29: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ప్రస్తుతం బాగా డిమాండ్ ఉన్న వృత్తి విద్యా కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్లో ప్రభుత్వ ఐటిఐ, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ కు సంబంధించిన వాల్ పోస్టర్లను సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) నెలకొల్పి వాటిలో ప్రస్తుతం బాగా డిమాండు ఉన్న కోర్సులను ప్రవేశపెట్టిదన్నారు. ఈ ఆధునిక వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు గాను రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు చెప్పారు. నైపుణ్యవంతమైన వృత్తి విద్యతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ టాటా సంస్థతో కలిసి అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి (6) కోర్సులను ప్రవేశ పెట్టిందన్నారు. కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 10వ తంగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని, కోర్సును బట్టి ఒకటి లేదా రెండు సంవత్సరాల కోర్సులు ఉన్నట్లు తెలిపారు. కోర్సు పూర్తి అయిన వెంటనే ఉపాధి, ఉద్యోగ కల్పన కు ఈ ఆధునిక కోర్సులు ఎంతగానో ఉపయోగ పడతాయని వీటిని జులై 31 లోగా భర్తీ చేసేందుకు గడువు ఉన్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్ http://iti.telangana.gov.in ను సందర్శించగలరు లేదా క 9490202037, 9849244030, 7995335372 కాల్ చేయవచ్చని సూచించారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, టీ గెట్ చంద్రశేఖర్ గౌడ్, ఏఎల్‌వో వేణు గోపాల్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

జనం పవర్, సిద్దిపేట, జూలై 29: బీఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాపరెడ్డి మంగళవారం పలువురు పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. కొండపాక మండలంలోని రవీంద్ర నగర్, వెలికట్ట, మర్పడగ, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు కార్యకర్తల కుటుంబాలను పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, రైతుబంధు మాజీ అధ్యక్షుడు ర్యాగళ్ల దుర్గయ్యలతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏమల్ల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, రాముల యాదగిరి, చేల్లపురం కనకయ్య, దున్న సాయిలు, భూపాల్ రెడ్డి, అంబటి భాను చందర్, కోడెల మల్లేశం, పిండి పవన్, సురేష్ ముదిరాజ్, నరసింహారెడ్డి, యాదగిరి, విద్యార్థి విభాగం మండల కన్వీనర్ ఎర్రోళ్ల భాస్కర్, వరుణ్ గౌడ్, చిక్కుడు భాను, గాథగోని రాకేష్, శేఖర్, కోడెల రవి యాదవ్, గిరాయపల్లి యాదగిరి, నరిగొప్పుల లింగం తదితరులు పాల్గొన్నారు.

'అబద్దాలను ప్రచారం చేస్తున్న మంత్రి'

జనం పవర్, సిద్దిపేట, జూలై 29: ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయకుండా సీఎం అబద్దాల ప్రచారానికి ఇంచ్జారిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం, ఎల్లారెడ్డి, సోమిరెడ్డి, శ్రీహరి యాదవ్ ఆరోపించారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన పేరులో వివేకం ఉంది కానీ సిద్దిపేట జిల్లాపై తాను మాట్లాడే మాటల్లో వివేకం లేదని ఆరోపించారు. సిద్దిపేటలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో చప్పట్ల కోసం మంత్రి ప్రజలను బతిలాడుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ బాల మల్లు, కౌన్సిలర్ సుందర్, మోహిజ్, రాములు, ఆంజనేయులు, సాయి ప్రేమ్, శ్రీనివాస్ రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

విభజనలో 30వ వార్డుకు అన్యాయం జరిగింది..

జనం పవర్, వనపర్తి, జూలై 29: వనపర్తి పట్టణంలోని 30వ వార్డు కు విభజనలో అన్యాయం జరిగిందిని, ఎమ్మెల్యే ఈ వార్డును అభివృద్ధి చేయాలని మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ కోరారు. మంగళవారం ప్రజల కోరిక మేరకు 30వ వార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ వనపర్తిలో ఉన్న ఇంజనీరింగ్ అధికారులు సరైన విధంగా నిధులను ఉప యోగించకుండా కొందరి సలహాతో రోడ్లు వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐదు సంవత్సరాల క్రితం వార్డు విభజనలో 30 వార్డును అన్యాయంగా ఐదు వార్డులను చీల్చి ఒక వార్డుగా చేశారని, దానివల్ల వార్డు అభివృద్ధి కుంటుపడిందన్నారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయంలో ఎక్కువగా 30వ వార్డు నుంచి వస్తుందన్నారు. జంగిడిపురం మర్రిచెట్టు నుంచి అనూస్ స్కూల్ వరకు గల రోడ్డు దెబ్బతిని గుంతల మయం అయిందని, మా రోడ్డు ఎమ్మెల్యే ఇంటికి కనెక్టివిల్ అవుతుందని, అలాగే సీవీ రామన్ కాలేజ్ కింది నుంచి నాగవరం పోయే రోడ్డు మొత్తం దెబ్బతిందని, కింద స్విమ్మింగ్ పూల్ ముందుగా ఉన్న రెండు రోడ్లు ఇంతవరకు వేయలేదని, వాటిని వెంటనే సీసీ రోడ్లు వేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌లను 30వ వార్డు ప్రజల తరపున కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, రామస్వామి నాగరాజు, రమేష్ ముదిరాజ్, గార్డుల శీను, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చికెన్ చట్నీ పులావ్ ఇలా చేయండి!

తెలంగాణ ప్రత్యేక వంటల్లో 'చికెన్ చట్నీ పులావ్' ఒకటి. ఆత్మీయుల్ని భోజనానికి పిలిచి.. దీన్ని వడ్డించారంటే సంతృప్తిగా విందు ఆరగిస్తారు..

ఎలా చేయాలంటే..

పావుకిలో బాస్మతి బియ్యం కడిగి నానబెట్టాలి. అరకిలో చికెన్ ముక్కల్లో అల్లం వెల్లుల్లి పేస్టు, కారం, పసుపు చెంచా చొప్పున, తగినంత ఉప్పు, పెరుగు వేసి కలిపి అరగంట పక్కనుంచాలి. ఈలోగా చట్నీ కోసం అర కప్పు పచ్చి కొబ్బరి, 3 పచ్చిమిరపకాయలు, 3 స్పూన్ల వేయించిన వేరుశనగపప్పు, అరంగుళం అల్లం ముక్క, గుప్పెడు పుదీనా, తగినంత ఉప్పు మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో 2 టేబుల్‌స్పూన్ల నెయ్యి వేడిచేసి.. ఒక బిర్యానీ ఆకు, 4 లవంగాలు, అంగుళం దాల్చినచెక్క, ఒక స్టార్‌మొగ్గ వేయాలి. అవి వేగాక.. అర కప్పు ఉల్లితరుగును వేయించాలి. అందులో మ్యారినేట్ చేసిన చికెన్ వేసి కలియతిప్పుతుండాలి. ముక్కలు కొంచెం వేగాక.. చట్నీ జతచేసి మూతపెట్టాలి. ఐదు నిమిషాలయ్యాక.. బియ్యం జోడించి వేయించాలి. నిమిషం తర్వాత.. తగినన్ని నీళ్లు పోసి సన్న సెగ మీద ఉడికించాలి. చివర్లో కొత్తిమీర తరుగు వేసి దించేయాలి. దీన్ని కుక్కర్‌లో కూడా చేసుకోవచ్చు. చట్నీ ఘుమాయింపుతో ఈ పులావ్ చాలా రుచిగా ఉంటుంది. ఇందు కోసం ప్రత్యేకంగా సైడ్ డిష్ చేయనవసరం లేదు. వెజ్ రైతా లేదా బూందీ రైతాతో సూపర్‌గా ఉంటుంది. శ్రమ తక్కువ, రుచి ఎక్కువ.

బీపీ రావడానికి కారణాలు ఇవే..!

బీపీ రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు వంటి కారణాల వల్ల బీపీ వస్తోంది. అధిక రక్తపోటుకు 10 సాధారణ కారణాలు లేదా ప్రమాద కారకాలు ఇక్కడ ఉన్నాయి.

జన్యుశాస్త్రం, కుటుంబ చరిత్ర

అధిక రక్తపోటు యొక్క కుటుంబ చరిత్ర రక్తపోటును అభివృద్ధి చేసే సంభావ్యతను పెంచుతుంది. శరీరం రక్తపోటును ఎలా నియంత్రిస్తుంది అనే దానిపై జన్యుపరమైన అంశాలు ప్రభావం చూపుతాయి.

వయస్సు

అధిక రక్తపోటు వయస్సుతో చాలా సాధారణం అవుతుంది, ముఖ్యంగా పురుషులలో 45 మరియు స్త్రీలలో 65 సంవత్సరాల తర్వాత రక్తపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వయస్సు పెరిగేకొద్దీ, వారి రక్త నాళాలు దృఢంగా మారతాయి, ఇది అధిక రక్తపోటుకు దోహదం చేస్తుంది.

ఊబకాయం మరియు అధిక బరువు

అధిక శరీర బరువు గుండె మరియు రక్త నాళాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది, ఇది రక్తపోటు పెరుగుదలకు దారితీస్తుంది. కొవ్వు కణజాలం కూడా శరీరంలో ఉప్పును నిలుపుకునేలా చేస్తుంది, ఇది రక్తపోటును పెంచుతుంది.

శారీరక నిష్క్రియాత్మకత

నిశ్చల జీవనశైలి అధిక రక్తపోటుకు ప్రధాన ప్రమాద కారకం. రెగ్యులర్ వ్యాయామం ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది మరియు మెరుగైన గుండె పనితీరును ప్రోత్సహిస్తుంది, ఇది రక్తపోటును తగ్గిస్తుంది.

ఆహారం (అధిక ఉప్పు తీసుకోవడం)

సోడియం (ఉప్పు) అధికంగా ఉన్న ఆహారం శరీరంలో ద్రవాన్ని నిలుపుకునేలా చేస్తుంది, ఇది రక్త పరిమాణంలో పెరుగుదలకు దారితీస్తుంది, ఇది రక్తపోటును పెంచుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలలో తరచుగా సోడియం ఎక్కువగా ఉంటుంది.

మితిమీరిన ఆల్కహాల్ వినియోగం

పెద్ద మొత్తంలో లేదా తరచుగా మద్యం సేవించడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అధిక మద్యపానం గుండె కండరాలను కూడా దెబ్బతీస్తుంది మరియు మరిన్ని సమస్యలకు దారితీస్తుంది.

క్రానిక్ కిడ్నీ డిసీజ్

ద్రవ సమతుల్యతను నియంత్రించడం మరియు హార్మోన్లను ఉత్పత్తి చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు (వ్యాధి లేదా ఇతర పరిస్థితుల వల్ల), అవి సరిగ్గా పనిచేయకపోవచ్చు, ఇది అధిక రక్తపోటుకు దారితీస్తుంది.

ఒత్తిడి

దీర్ఘకాలిక ఒత్తిడి రక్తపోటులో తాత్కాలిక స్పైక్‌లకు దారి తీస్తుంది. అదనంగా, ఒత్తిడి అతిగా తినడం, ధూమపానం లేదా మద్యపానం వంటి అనారోగ్య ప్రవర్తనలను ప్రోత్సహిస్తుంది, ఇది రక్తపోటుకు దోహదం చేస్తుంది.

ధూమపానం

ధూమపానం రక్త నాళాలను దెబ్బతీస్తుంది, ధమనులను తగ్గిస్తుంది మరియు హృదయ స్పందన రేటును పెంచుతుంది, ఇవన్నీ రక్తపోటును పెంచుతాయి. సిగరెట్‌లోని నికోటిన్ రక్తపోటును తాత్కాలికంగా పెంచుతుంది.

స్లీప్ అప్నియా

అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా, ఇక్కడ నిద్రలో వాయుమార్గం నిరోధించబడుతుంది, అధిక రక్తపోటుతో సంబంధం కలిగి ఉంటుంది. ఇది ఆక్సిజన్ స్థాయిలలో అడపాదడపా పడిపోతుంది, హృదయ స్పందన రేటు మరియు రక్తపోటు పెరుగుదలను ప్రేరేపిస్తుంది.